

స్టీల్ ప్లాంటులో భారీ పేలుడు

- బ్లాస్ట్‌ఫర్నేస్-3లో ప్రమాదం
- ఎగిసిన మంటలు... కార్మికుల పరుగులు
- పాదలు అంటుకున్నాయని యాజమాన్యం ప్రకటన



బ్లాస్ట్‌ఫర్నేస్-3 నుంచి ఎగిసిపడిన మంటలు

- వివరాలు మెయిన్‌లో

రైల్వే స్టేషన్ కిటకిట

పండుగ ప్రయాణాలతో కిక్కిరిసిన రైళ్లు

రత్నాచల్, గోదావరి, విశాఖ, గరీబ్‌రథ్, ప్రశాంతి సహా పలు రైళ్లకు అత్యధిక డిమాండ్

విశాఖపట్నం, జనవరి 13:

పండుగ ప్రయాణాలు ఊపందుకున్నాయి. శనివారం ప్రయాణికులతో రైల్వే స్టేషన్ కిటకిటలాడింది. విశాఖ నుంచి బయలుదేరే ఒరిజినేటింగ్ రైళ్లతోపాటు దూర ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా సికింద్రాబాద్, చెన్నై, బెంగళూరు, భువనేశ్వర్ చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే రైళ్లన్నీ కిక్కిరిసి కనిపించాయి. ఉదయం 6.15 గంటలకు బయలుదేరే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805) నుంచి సాయంత్రం ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519) వరకు రద్దీ కొనసాగింది.

విజయవాడ, రాజమండ్రి చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే అత్యధిక ప్రయాణికులు మధ్యాహ్నం విశాఖ నుంచి బయలుదేరే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఆశ్రయించారు. కుటుంబ సమేతంగా బయలుదేరినవారు రత్నాచల్‌లో సీట్ల కోసం రెండు గంటల ముందుగానే స్టేషన్‌కు చేరుకుని క్యూలో నిరీక్షించారు. మరికొందరు తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488)ను ఆశ్రయించారు. ఇక సికింద్రాబాద్ వెళ్లే గోదావరి (12727), విశాఖ (17015), గరీబ్‌రథ్ (12739), ఎల్‌టీటీ (18519), ఫలక్‌నుమా(12703), కోణార్క్ (11020) ఎక్స్‌ప్రెస్‌లన్నీ నిండు బెర్తులతో కిక్కిరిసి నడిచాయి. అలాగే బెంగళూరు, చెన్నై పట్టణాలకు వెళ్లే భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), హౌరా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12863),కోరమండల్ (12841), మెయిల్ (12839), బొకారో (13351) వంటి ప్రతిరోజు నడిచే రైళ్లతో పాటు వారాంతపు ఎక్స్‌ప్రెస్‌లు రద్దీగా నడిచాయి. కాగా విజయనగరం, శ్రీకాకుళం, పలస, రాయగడ, భువనేశ్వర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లు శనివారం ప్రయాణికులతో కిక్కిరిశాయి.



శనివారం మధ్యాహ్నం రత్నాచల్ వచ్చిన సమయంలో ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ప్లాట్‌ఫాం

ఆర్టీసీకి తాకిడి

310 ప్రత్యేక సర్వీసులు నడిపిన అధికారులు

ద్వారకా బస్‌స్టేషన్, జనవరి 13: ఆర్టీసీకి ప్రయాణికుల తాకిడి శనివారం మరింత పెరిగింది. దీంతో పీటీడీ విశాఖ రీజియన్ అధికారులు స్టీల్‌సిటీ, గాజువాక, సింహాచలం, మద్దిలపాలెం కాంప్లెక్సుల నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు, నర్సీపట్నం, రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు 310 ప్రత్యేక సర్వీసులు నడిపారు. ఉదయం నుంచి రాత్రి 9.00 గంటల వరకూ శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, రాజాం, పాతపట్నం ప్రాంతాలకు 130 ప్రత్యేక సర్వీసులు నడిపారు. అలాగే విజయనగరం జిల్లాలోని విజయనగరం, పార్వతీపురం, పాలకొండ, సాలూరు ప్రాంతాలకు 120, విజయవాడకు 15, అమలాపురానికి 10, నర్సీపట్నం 15, కాకినాడకు 20 ప్రత్యేక సర్వీసులు నడిపారు. షెడ్యూల్ సర్వీసులకు మించి ప్రయాణికుల డిమాండ్ ఉండడంలో ప్రత్యేక సర్వీసులు నడిపినట్టు రీజనల్ మేనేజర్ అంధవరపు అప్పలరాజు తెలిపారు.



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వాక్‌స్టాప్ కౌంటర్ల వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు

సొంతూళ్లకు పయనం

బారులుతీరిన వాహనాలు

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి):
నగరవాసుల్లో పలువురు సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు సొంతూళ్లకు బయలుదేరారు. ఉద్యోగం, వ్యాపారం, చదువు నిమిత్తం నగరంలో ఉంటున్నవారంతా స్వస్థలాలకు పయనమయ్యారు. దీంతో శనివారం ఇటు శ్రీకాకుళం, విజయనగరం, అటు రాజమండ్రి వైపు వెళ్లే రహదారులు వాహనాలతో కిక్కిరిశాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచి అర్ధరాత్రి వరకూ వందలాది వాహనాలు బారులు తీరి కనిపించాయి. అలాగే ప్రయాణికులతో రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిటలాడాయి. ఇకపోతే షాపింగ్‌మాల్స్, వస్త్ర దుకాణాలు కూడా కొనుగోలుదారులతో కిక్కిరిసి కనిపించాయి. ఆయా ప్రాంతాల్లో వాహనాలు రద్దీ అధికంగా ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

రియల్ ఢమాల్

- అంచనాలను అందుకోని రిజిస్ట్రేషన్లు
- గడచిన 9 నెలల ఆదాయ లక్ష్యం రూ.942.48 కోట్లు
- వచ్చింది రూ.640.44 కోట్లు ...67.95 శాతం మాత్రమే రాక
- పరిపాలనా రాజధాని ప్రచారాన్ని నమ్మని జనం
- ఆచితూచి స్థిరాస్తుల కొనుగోళ్లు
- ఎన్నికలు తరువాత చూసుకోవచ్చుననే ఆలోచనలో అత్యధికులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం అంచనాలను అందుకోలేకపోతోంది. పరిపాలనా రాజధాని అని చెప్పి అమరావతి అధికారులు భారీ లక్ష్యాలను ఇస్తున్నారు. కానీ స్థానికంగా ఎవరూ స్థిరాస్తుల కొనుగోళ్లకు ముందుకు రాకపోవడంతో లక్ష్యంలో 70 శాతం కూడా సాధించలేకపోతున్నారు.

విశాఖపట్నం పరిపాలనా రాజధాని అవుతోందని, త్వరలో లో సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటుకాబోతోందని ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసింది. రుషికొండ, ఎండాడ ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలు వస్తాయని ఊదరగొట్టింది. దాంతో ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు భారీగా పెరిగిపోయాయి. ఎప్పటి నుంచో వివిధ ప్రభుత్వ సంస్థలతో వివాదాల్లో ఉన్న వందలాది ఎకరాలను అధికార పార్టీ నాయకులు చేజిక్కించుకున్నారు. వాటిని వెంచర్లుగా మార్చి విక్రయాలకు తెరతీశారు. విల్లాలు, హై రైజ్ అపార్టుమెంట్లు అంటూ వాటి ధరలను కోట్ల రూపాయల్లోకి తీసుకువెళ్లారు. మూడు రాజధానుల ప్రక్రియ న్యాయస్థానం వరకూ వెళ్లడంతో ముందుకు సాగలేదు. ఈలోగా సాధారణ ఎన్నికలు కూడా దగ్గరపడడంతో కొనుగోలుదారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం మారితే అమరావతే రాజధానిగా ఉంటుందని, అప్పుడు విశాఖలో భూముల ధరలు తగ్గిపోయే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పుడు అధిక ధరలు పెట్టి కొనుగోలు చేస్తే నష్టపోతామని, 2024 మే నెల తరువాత పరిస్థితి చూసుకుని అప్పుడే విశాఖలో స్థిరాస్తులు కొనడం మంచిదనే నిర్ణయానికి వస్తున్నారు. దాంతో భవిష్యత్తు అవసరాల కోసం భూములు, భవనాలపై పెట్టుబడులు పెట్టేవారు తగ్గిపోయారు. సొంత ఇంటి కల సాకారం చేసుకోవడానికి ఫ్లాట్ అవసరం అనుకునే వారు, బ్యాంకు రుణాల లభ్యత ఉన్నవారు మాత్రమే ప్రస్తుతం కొనుగోళ్లకు ముందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం తగ్గిపోయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో ప్రభుత్వం ఇచ్చిన రూ.942.48 కోట్ల లక్ష్యంలో కేవలం 67.95 శాతంతో రూ.640.44 కోట్లు మాత్రమే ఆదాయం సాధించారు.

తొమ్మిది కార్యాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు

విశాఖ జిల్లాలో ఆనందపురం, భీమిలి, ద్వారకానగర్, గాజువాక, గోపాలపట్నం, మధురవాడ, పెందుర్తి, సూపర్ బజార్, పెదగంట్యాడల్లో ... మిగతా 6వ పేజీలో

నెల వారీగా ఆదాయం వివరాలు

నెల	లక్ష్యం	సాధించిన ఆదాయం
ఏప్రిల్	రూ.104.63 కోట్లు	రూ.63.9 కోట్లు
మే	రూ.94.79 కోట్లు	రూ.92.93 కోట్లు
జూన్	రూ.104.63 కోట్లు	రూ.66.46 కోట్లు
జూలై	రూ.126.84 కోట్లు	రూ.64.88 కోట్లు
ఆగస్టు	రూ.121.37 కోట్లు	రూ.94.24 కోట్లు
సెప్టెంబరు	రూ.82.87 కోట్లు	రూ.63.14 కోట్లు
అక్టోబరు	రూ.98.09 కోట్లు	రూ.62.98 కోట్లు
నవంబరు	రూ.98.09 కోట్లు	రూ.61.55 కోట్లు
డిసెంబరు	రూ.111.17 కోట్లు	రూ.70.36 కోట్లు
మొత్తం	రూ.942.48 కోట్లు	రూ.640.44 కోట్లు



సంక్రాంతి సంబరాల్లో టీడీపీ నేతలు

టీడీపీ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు

- భోగి మంటల్లో ప్రభుత్వ జీవోలు

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యాలయాన్ని తోరణాలతో అలంకరించి ఆవరణలో ముగ్గులు వేశారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. అనంతరం భోగి మంట వేసి వైసీపీ ప్రభుత్వం జారీచేసిన జీవోలను అందులో వేశారు. సంబరాల్లో విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ, పార్టీ నాయకులు పాశర్ల ప్రసాద్, చిక్కాల విజయ్, తదితరులు పాల్గొన్నారు. నాయకులంతా సంప్రదాయ దుస్తులు ధరించారు.

భోగి మంటల్లో ఎస్మా పత్రాలు దహనం



అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. శనివారం జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద భోగి మంటల్లో ఎస్మా పత్రాలు వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేంత వరకూ సమ్మెను కొనసాగిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

- వార్త III పేజీలో

వైసీపీ నేత రుబాబు

మధురవాడలో మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణ కోసం ఆయనకు చెందిన భవనంలో కొంతమేర తొలగించాల్సిన పరిస్థితి

- అందుకు గతంలోనే టీడీఆర్ జారీచేసిన జీవీఎంసీ
- ఆ మేరకు స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంలో తాత్సరం చేసిన సిబ్బంది
- తాజాగా అదే భవనంపై అదనపు అంతస్థు నిర్మాణం చేపట్టిన యజమాని
- అడ్డుకునేందుకు వెళ్లిన టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై విరుచుకుపడిన వైనం



అక్రమ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు వెళ్లిన జీవీఎంసీ సిబ్బందిని నిలువరిస్తున్న దృశ్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ జోన్-2 (మధురవాడ)లో అధికార పార్టీకి చెందిన చోటా నేత అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న భవనంలో కొంత మేర తొలగించడానికి జీవీఎంసీ నుంచి చాలాకాలం కిందటే ఆయన టీడీఆర్ తీసుకున్నారు. అయినా స్థలాన్ని జీవీఎంసీకి అప్పగించకపోగా, అదే భవనంపై అదనంగా మరొక అంతస్థు నిర్మాణం ప్రారంభించారు. ఈ విషయం తెలిసి రెండు రోజుల క్రితం అడ్డుకునేందుకు వెళ్లిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో గొడవకు దిగారు. నియోజక వర్గానికిచెందిన పెద్దల అండదండలు ఉన్నాయనే ధైర్యంతోనే ఆయన రెచ్చిపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అధికారుల సమాయత్తం
- అధికార పార్టీకి చెందిన నేత ఒత్తిడితో వెనక్కి తగ్గినట్టు ప్రచారం

మధురవాడలో జాతీయ రహదారి జంక్షన్ నుంచి బక్కన్నపాలెం నవోదయ స్కూల్ వరకూ ప్రస్తుతం 40 అడుగులు రోడ్డు ఉంది. దీనిని భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 80 అడుగులకు విస్తరించాలని వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచింది. రోడ్డు విస్తరణకు జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు 2023 ప్రారంభంలో సర్వే చేసి, ఆర్‌డీపీ తయారుచేశారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరించాలంటే జాతీయ రహదారి సర్వీసు రోడ్డును ఆనుకుని గల ఒక వాణిజ్య భవనంలో కొంతభాగం సేకరించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న భవనంలో సుమారు 155.88 చదరపు మీటర్ల స్థలం రోడ్డు విస్తరణకు అవసరమని సర్వే అధికారులు మార్కింగ్ చేశారు. ఆ మేరకు భవనం తొలగించి తమకు అప్పగించాలంటూ టౌన్ ప్లానింగ్ అధికారులు భవన యజమానికి నోటీసులు జారీచేశారు. స్వాధీనం చేసుకోబోయే స్థలానికి నాలుగు రెట్లు ఎక్కువగా అంటే 623.52 చదరపు మీటర్ల టీడీఆర్‌ను (నంబర్1086/00073/టీడీఆర్/ఎంవీడబ్ల్యూ/2023) గత ఏడాది జనవరిలోనే భవన యజమానికి అందజేశారు. టీడీఆర్ జారీచేసిన తర్వాత టౌన్‌ప్లానింగ్ అధికారులు ... మిగతా 6వ పేజీలో

కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే చర్యలు

- పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్



విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా నగరంలో ఎవరైనా కోడి పందాలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ రవిశంకర్‌అయ్యన్నార్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పండుగ పేరుతో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలని సీఐలను ఆదేశించామన్నారు. ఎక్కడైనా పేకాట, కోడిపందాలు వంటివి జరుగుతుంటే 9493336633 లేదా పోలీస్ హెల్ప్‌లైన్ 112 సమాచారం అందించాలని సీపీ కోరారు.

ఓటర్ల పెరుగుదల

- గత ఏడాది అక్టోబరు 27న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 19,15,682 మంది ఓటర్లు
- ప్రస్తుతం 19,41,923... 26,241 మేర పెరిగిన ఓట్లు
- స్వల్ప మార్పులు ఉండవచ్చునంటున్న అధికారులు
- 22న తుది జాబితా విడుదల



విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల తుది జాబితా విడుదలకు ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది. ఇప్పటివరకు చేపట్టిన మార్పులు, చేర్పులను బట్టి అక్టోబరు 27న విడుదల చేసిన ముసాయిదా జాబితాతో పోల్చితే 26,241 ఓట్లు పెరిగాయి. ఈనెల 22వ తేదీన తుది జాబితా విడుదల చేయనున్నం దున కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో మార్పులు, చేర్పులు అప్‌లోడ్ చేయడం శుక్రవారంతో నిలిపివేశారు.

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అక్టోబరు 27న విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం 19,15,682 మంది ఓటర్లు ఉండగా శనివారం నాటికి ఓటర్ల సంఖ్య 19,41,923కు చేరుకుంది. అయితే ఈనెల 22వ తేదీన తుది జాబితా విడుదల చేసే సమయానికి ఓటర్ల సంఖ్యలో స్వల్ప మార్పులు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. అక్టోబరు 27న జాబితా విడుదల చేసిన తరువాత కొత్తగా 1,62,361 మంది ఓటర్లుగా నమోదు కాగా...1,36,120 ఓట్లు తొలగించారు. గత అక్టోబరు 27వ తేదీ నాటి జాబితాతో పోల్చితే విశాఖ పశ్చిమలో 14,340 ఓట్లు, దక్షిణంలో 7,055 ఓట్లు తగ్గగా, మిగిలిన ఐదు సెగ్మెంట్‌లలో పెరిగాయి. విశాఖ తూర్పులో 29,554, భీమిలిలో 27,498, గాజువాకలో 25,740, ఉత్తరంలో 22,286, పెందుర్తిలో 21,833, పశ్చిమలో 20,431, దక్షిణ ... మిగతా 6వ పేజీలో

ముసాయిదా జాబితాలో ఓటర్ల వివరాలు, శుక్రవారం నాటికి పెరిగిన/తగ్గిన ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	27.10.23	12.1.24 నాటికి వివరాలు
భీమిలి	3,39,909	3,51,198
విశాఖ తూర్పు	2,65,273	2,76,379
దక్షిణం	2,17,130	2,100,75
ఉత్తరం	2,71,737	2,74,684
పశ్చిమ	2,21,340	2,06,900
గాజువాక	3,12,809	3,23,405
పెందుర్తి	2,87,484	2,99,282

సొంత ఊళ్లకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి

▸▸ పోలీసు అధికారుల సూచన

సీతంపేట, జనవరి 13: సంక్రాంతి పురస్కరించుకొని సొంత ఊళ్లకు వెళ్లే వారు ఇళ్లల్లో చోరీలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ విజయ్‌కుమార్, ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ రమేశ్ సూచించారు. తమ స్టేషన్ల పరిధిలోని వారు ఎవరైనా ఊరు వెళ్లితే స్టేషన్‌కు వచ్చి ఇంటి చిరునామా, తదితర సమాచారం అందించాలన్నారు. ఇంటికి సీసీ కెమెరాలుంటే మొబైల్ ద్వారా ఎక్కడినుంచి అయినా పర్యవేక్షించవచ్చన్నారు. ఊరుకు వెళ్లే సమయంలో తమ ద్విచక్రవాహనాలను రహదారులపైవదిలి వెళ్లొద్దన్నారు. సురక్షిత ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలన్నారు. ఇళ్ల కిటికీలు, తలుపులకు కచ్చితంగా తాళం వేయాలన్నారు. రెండు రోజులకోసారి ఇంటి పక్కనున్న ఉన్న వారితో మాట్లాడాలన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

పండగ సందర్భంగా ఎవరైనా విచ్చలవిడిగా రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠినచర్యలు తీసుకుంటామని సీఐలు హెచ్చరించారు. ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా తమ ప్రాణాలతోపాటు ఎదుటివారికీ ముప్పు తెచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే... పోలీసు స్టేషన్లకు లేదా, 100కి, 112 నంబర్లకు సమాచారమివ్వాలని పేర్కొన్నారు.

తాగునీటి సమస్యపై ఫిర్యాదు



కార్పొరేటర్ అప్పలరత్నంకు సమస్య వివరిస్తున్న కుమ్మరవీధి మహిళలు

జగదాంబ కూడలి, జనవరి 13: జీవీఎంసీ కొళాయిల ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా కాక ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు 30వ వార్డు కుమ్మరవీధి ప్రాంతానికి చెందిన మహిళలు కార్పొరేటర్ కోడూరి అప్పలరత్నంకు ఫిర్యాదు చేశారు. శనివారం స్థానిక పోలమాంబ అమ్మవారి జాతరకు సంబంధించి ఏర్పాట్ల పరిశీలన కార్పొరేటర్ వచ్చారు. ఈసందర్భంగా మహిళలుకొళాయి నీటి సరఫరాలో సమయపాలన ఉం డడం లేదని వివరించారు. బిందెడు నీరు నిండేందుకే చాలా సమయం పడుతుందన్నారు. దీనిపై కార్పొరేటర్ స్పందించి... వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడారు. సమస్య పరిచేయాలని ఆదేశించారు.శ్రీ పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు స్థానిక సమస్యలపై కార్పొరేటర్‌కు వినతులు అందజేశారు. వైసీపీ సీనియర్ నాయకుడు పెంటపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు వితరణ



నిత్యావసరాలందిస్తున్న చారిటీ బాక్స్ సభ్యులు

మహారాణిపేట, జనవరి 13: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని చారిటీ బాక్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పేదలకు నిత్యావసరవస్తువులు, నూతన దుస్తులు పంపిణీ చేశారు. మహారాణిపేట, పాత పోస్టాఫీసు, పెదవాల్తేర్, తాటిచెట్లపాలెం తదితర ప్రాంతాల్లో నిరాశ్రయులను గుర్తించి వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి తాడికొండ కరుణాకరణ, లక్కోజు నూకరాజు, కే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



తుది దశలో మాధవధార శంకరనారాయణ రహదారి



నిర్మాణంలో ఉన్న కళింగనగర్ రోడ్డు

చురుగ్గా సీసీ రహదారుల నిర్మాణం

▸▸ మురళీనగర్, మాధవధార కాలనీల్లో కొత్త రూపు

మాధవధార, జనవరి 13; ఉత్తర నియోజకవర్గ పరిధిలోని మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో మెయిన్ రోడ్లకు అనుసంధానంగా ఉన్న రహదారులు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. అన్ని వీధుల్లో బీటీ, లేకుంటే సిమెంట్ కాంక్రీటు రోడ్లతో కొత్త మార్గాలను రూపొందిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆఘమేఘాల మీద రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. స్థానికులను సీసీ రోడ్డా.. తారు రోడ్డు వేయాలా? అని సంతకాల ద్వారా అభిప్రాయాలు తెలుసుకుని మరీ పనులు జరుపుతున్నారు. మార్గాల పక్కన మొక్కలు ఉంచాలా? వద్దా అనే అంశాలను తెలుసుకుని పూర్తిచేస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్లకు చేతి నిండా పని దొరుకుతోంది. అధికారులూ బిజీ అయ్యారు. నాయకులు ఇన్ని రూ. కోట్లతో మీ వార్డుని అభివృద్ధి చేస్తున్నామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఏ కారణంతోనైనా రాకపోకలకు తమ కష్టాలు తీరుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పూర్ణామార్కెట్ వద్ద ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపులో వన్‌టౌన్ సీఐ షణ్ముఖరావు

పూర్ణామార్కెట్, జనవరి 13: పూర్ణామార్కెట్ ట్రాఫిక్ నియంత్రణపై వన్‌టౌన్ పోలీసులు దృష్టి సారించారు. ప్రధానంగా పార్కింగ్ స్థలం, రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు జరపడంతో సమస్యలు నెలకొంటున్నాయి. మెయిన్ రోడ్డు నుంచి దుర్గాలమ్మ గుడికి వెళ్లే రహదారి ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంది. దీంతో గత రెండురోజులుగా కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. దీంతో వర్తక సంఘం ప్రతినిధులు వన్‌టౌన్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ, ఎస్ఐ విశ్వనాథ్ రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై శనివారం చర్యలకుదిగారు. పార్కింగ్ స్థలం వద్ద అడ్డంగా ఉన్న దుకాణాలను తొలగించారు. రహదారులపై తోపుడు బండ్లను నియంత్రించారు. ట్రాఫిక్ నియంత్రించి పోలీసులు వెళ్లిన వెంటనే తిరిగి వేరేచోట్ల వ్యాపారాలను సాగించడం విశేషం. అలాగే, సంక్రాంతి నేపథ్యంలో మార్కెట్‌లో మేడపైన వ్యాపారాలు సాగించే వ్యాపారులను రోడ్డుమీదకు అనుమతించడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

టీడీపీ గెలుపునకు సమష్టి కృషి

▸▸ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు



జయహో బీసీ సభలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

అక్కయ్యపాలెం, జనవరి 13: బీసీలంతా సమష్టిగా టీడీపీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టీడీపీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి చిక్కాల విజయ్‌బాబు, పరిశీలకుడు రాజాన రమేష్ పిలుపునిచ్చారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 45వ వార్డు అధ్యక్షుడు భరణికాన రాజు ఆధ్వర్యంలో శనివారం శివశంకర రజక కాలనీలోని సామాజిక భవనంలో జయహో బీసీ పేరిట సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వారు హాజరై ప్రసంగించారు. వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ శ్రేణులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తమ్మిన విజయ్‌కుమార్, అనసూరి మధు, గొలగాని సౌజన్య, షేక్ బాబ్జీ, పలిశెట్టి అప్పన్న, వాసుపల్లి రాజు, ఈతలపాక సుజాత, ఆకిరెరెడ్డి జగదీష్ పాల్గొన్నారు.

కిల్లాడ సత్యనారాయణ సాహిత్య కృషి భేష్

▸▸ 'ఆత్మచిత్రం' పుస్తకావిష్కరణ సభలో సీపీ రవిశంకర్



పుస్తకావిష్కరణలో సీపీ డాక్టర్ రవిశంకర్, సాహితీవేత్తలు

సీతంపేట, జనవరి 13: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శ్రీ విశ్వ కళ్యాణ భారతి సేవా సంఘం ఆధ్వర్యంలో కవి, వ్యాసకర్త,అనువాదకులు , సీబీసీఐడీ ఏడీజీ (లక్నో) కిల్లాడ సత్యనారాయణ రచించిన ఆత్మచిత్రం పుస్తకాన్ని అడిషనల్ డీజీపీ, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆవిష్కరించారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి డాక్టర్ కేదార్నాథ్ సింగ్ రచనల్లో ఎంపిక చేసిన 100 కవితలను అనువాదం చేసి ఆత్మచిత్రం పేరిట పుస్తకం రచించారు. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మాట్లాడుతూ, సత్యనారాయణ పోలీసు శాఖలో ఉన్నతోద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ- మరోవైపు సాహిత్యాభిలాష కొనసాగించడం గొప్పవిషయమన్నారు. కేదార్నాథ్ సింగ్ కవితలను అనువదించి తెలుగువారికి పరిచయం చే యడం హర్షణీయమన్నారు. కేదార్నాథ్ సింగ్ ప్రముఖ విమర్శకుడు, వ్యాసకర్త కూడా అని ఆయన వివరించారు. పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ పీహెచ్‌డీ డాక్టర్ బీపీఎస్ కళ్యాణి, గీతం యూనివర్శిటీ ఇంగ్లిష్ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, కొత్తగూడెంకు చెందిన రచయిత భగవతం, సాహితీ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ రవిశంకర్

విశాఖపట్నం (స్పోర్ట్స్), జనవరి 13: వాల్తేరు రైల్వే గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న మార్వాడీ క్రికెట్ పోటీలను శనివారంనగర పోలీసు కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యర్, గ్రేహౌండ్స్ ఐజీ రాజీవ్ మీనా ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ఆరేళ్ల నుంచి క్రమం తప్పకుండా సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తూ యువ క్రీడాకారులను ప్రోత్సహించడం విశేషమని పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీ జరగనుంది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజేష్ పగరియా, హరప్ప పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత గండి బాబ్జీ

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని 39వ వార్డు ఫెర్రీ రోడ్‌వద్ద శనివారం రాత్రి సుమారు 200 మంది పేదలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ నిత్యావసర సరకులు అందజే శారు. సంక్రాంతి పురస్కరించుకుని బియ్యం, పప్పులు, కూరగాయలు తదితరవాటిని అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ పేద వర్గాలు ఆనందంగా పండగ జరుపుకోవాలని ఈ వస్తుసామగ్రి పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లడ్డూ బాయ్, వాసుపల్లి దానేశు, మైలపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి శర్మ



సాంకేతిక పర్యవేక్షకునిగా నియమితులైన శర్మ

విశాఖపట్నం (స్పోర్ట్స్), జనవరి 13: వరల్డ్ చాంపియన్‌షిప్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి నగరానికి చెందిన బ్లూ బ్యాడ్జీ ఇంటర్నేషనల్ అంపైర్, ఎల్ఐసీ ఉద్యోగి డాక్టర్ డీవీఎస్‌వై శర్మ సాంకేతిక పర్యవేక్షకునిగా నియమితులయ్యారు.ఈ మేరకు భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య జారీ చేసిన దేశంలోని అత్యుత్తమ పది మంది అంపైర్ల జాబితాలో శర్మ ఒకరు కావడం విశేషం. గోవాలో ఈనెల 23 నుంచి జరిగే ఈ టోర్నీకి శర్మ ప్రధాన అంపైర్లలో ఒకరిగా వ్యవహరించనున్నారు. శర్మ టేబుల్ టెన్నిస్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, జిల్లా కార్యదర్శిగా, ఎల్ఐసీ స్పోర్ట్స్ బోర్డు మెంబరుగా కూడా సేవలందిస్తున్నారు. వరల్డ్ టెన్నిస్ పర్యవేక్షకునిగా ఎన్నిక కావడంపై ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్, మేనేజర్ పర్సనల్ భగవాన్ ప్రసాద్, ఉద్యోగుల సంఘ నాయకులు ఎం.కామేశ్వరి, వరప్రసాద్‌తోపాటు టేబుల్ టెన్నిస్ సంఘం ప్రతినిధులు, కోచ్‌లు తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

జిల్లా వాసులకు కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు

మహారాణిపేట, జనవరి 13: తెలుగువారి సంప్రదాయాలకు అద్దంపట్టే సంక్రాంతి ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని కలెక్టర్ ఏ మల్లికార్జున ఆకాంక్షించారు. సంక్రాంతి శుభవేళ మేలు చేకూరాలని, జిల్లా వాసులకు శుభాకాంక్షలు తెలిపారు.

కిటకిటలాడిన రైతుబజారు



నరసింహనగర్ రైతుబజారులో రద్దీ

అక్కయ్యపాలెం, జనవరి 13: సం క్రాంతికి సంబంధించిన పూజా సామగ్రి, కూ రగాయలు కొనుగోలుకు వచ్చిన వారితో నరసింహనగర్ రైతుబజారు శనివారం కిక్కిరిసింది. చెరకు గెడలు, వివిధ రకాల పండ్లు, తదితర సామగ్రి కొనుగోలుచేశారు. ఉదయంనుంచి రైతుబజారులో అన్ని స్టాల్స్ కిటకిటలాడాయి.

వైసీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా రమణికుమారి

మురళీనగర్, జనవరి 13 ; వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా మాధవధారకు చెందిన పేడాడ.రమణికుమారి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు అందినట్లు ఆమె తెలిపారు. పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పటిష్టతకు పనిచేస్తానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. తనకీ పదవి వచ్చేలా సహకరించిన పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డి, స్పీకర్ టి.సీతారామ్, విశాఖనగర అధ్యక్షులు కె.గురువులుతదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

తండ్రి అస్థికలు గోదావరిలో కలిపి వస్తూ

తిరిగిరాని లోకాలకు..

తాళ్లపాలెం వద్ద కారు బోల్తా పడి వ్యక్తి మృతి

ముగ్గురికి తీవ్రగాయాలు



తాళ్లపాలెం వద్ద బోల్తా పడిన కారు. (ఇన్‌సెట్లో) మృతి చెందిన భాస్కరరావు (ఫైల్)

కశింకోట, జనవరి 13: తండ్రి అస్థికలను గోదావరిలో నిమజ్జనం చేసి తిరిగి వస్తుండగా కారు అదుపుతప్పి బోల్తాపడడంతో కుమారుడు మృతి చెందిన విషాదకర సంఘటన శనివారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో కుమారుడితోపాటు ముగ్గురు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పరవాడ మండలం ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీకి చెందిన రిటైర్డ్ కానిస్టేబుల్ ఈతా నారాయణరావు ఈ నెల పదో తేదీన మృతిచెందారు. అంత్యక్రియలు పూర్తయిన తరువాత అస్థికలను గోదావరిలో నిమజ్జనం చేయాలని కుటుంబ సభ్యులు భావించారు. నారాయణరావు కుమారులు వాసుదేవరావు, భాస్కరరావు (40)తోపాటు దగ్గర బంధువులు ఈతా మురళీగణేశ్, రెడ్డిపల్లి వెంకటరావు, రాచపల్లి గిరిశ్ అచ్యుతకుమార్ కలిసి కారులో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత రెండు గంటల సమయంలో రాజమహేంద్రవరం బయలుదేరారు. శనివారం ఉదయం ఆరు గంటలకు అక్కడకు చేరుకుని, అస్థికలను గోదావరిలో నిమజ్జనం చేసిన అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. అచ్యుతకుమార్‌కు చెందిన కారును (ఎర్టిగా) వాసుదేవరావు డ్రైవ్ చేస్తున్నారు. ఉదయం 8.45 గంటల ప్రాంతంలో తాళ్లపాలెం సమీపంలో బ్రిడ్జి వద్ద కారు అదుపుతప్పింది. ఎడమవైపున ఉన్న రక్షణ స్తంభాలను ఢీకొని కిందకు దూసుకువెళ్లి బోల్తా పడింది. దీంతో గిరిశ్ అచ్యుతకుమార్ మినహా మిగిలిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. భాస్కరరావు పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. మిగిలిన ముగ్గురు ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గిరీష్ అచ్యుతకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ సుందరమ్మ తెలిపారు.

వైసీపీ నేత రుబాబు

... 5వ పేజీ తరువాయి

ఆ మేరకు భవనాన్ని తొలగించి స్థలం స్వాధీనం చేసుకోవాల్సి ఉన్నా, అధికార పార్టీకి చెందిన నేత కావడంతో ఇంతవరకూ ఆ పనిచేయలేకపోయారు. ఒకసారి భవనాన్ని తొలగించేందుకు యత్నించినా అధికార పార్టీలో పైస్థాయి నాయకుడు అడ్డంపడడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఇదిలావుండగా తాజాగా అదే భవనంపై అదనపు అంతస్థు నిర్మాణం ప్రారంభించారు. ఈ సమాచారం తెలిసి టౌన్ ప్లానింగ్ సిబ్బంది వెళ్లారు. అదనపు అంతస్థు పనులను అడ్డుకున్నారు. దీంతో భవన యజమానికి సంబంధించిన వ్యక్తులు వారిపై తిరగబడడంతో భయపడిపోయి, తమ పైఅధికారులకు సమాచారం ఇచ్చారు. ఏసీపీ షణ్ముంశాస్త్రితోపాటు స్వయంగా సీసీపీ బి.సురేష్‌కుమార్ అక్కడకు వెళ్లినప్పటికీ భవన యజమానితోపాటు ఆయనకు సంబంధించిన వ్యక్తుల రుబాబు తగ్గలేదు. తాను నిర్మాణ పనులను ఆపేది లేదంటూ పనులు కొనసాగించడంతో ఏసీపీ షణ్ముంశాస్త్రి పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావించారు. కానీ ఏమైందోగానీ ఇంతవరకూ పోలీసులకు ఫిర్యాదు అందకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అధికార పార్టీ నేత అయిన సదరు భవన యజమానికి నియోజకవర్గ స్థాయి నేతల అండదండలు ఉండడం వల్లే టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుకొచ్చిన గొడవని మౌనం దాల్చినట్టు తెలిసింది. సామాన్యుల విషయంలో నిబంధనల పేరుతో చెలరేగిపోయే టౌన్‌ప్లానింగ్ అధికారులు...టీడీఆర్ జారీచేసినా స్థలాన్ని ఇంతవరకూ స్వాధీనం చేసుకోకపోవడం, అదనపు అంతస్థు నిర్మిస్తున్నా చోద్యం చూడడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రియల్ ఢమాల్

... 5వ పేజీ తరువాయి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో మధురవాడ, సూపర్‌బజార్ కార్యాలయాల్లో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. వీటిలో ఒక్కొక్కచోట నెలకు రూ.15 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. తొమ్మిది కార్యాలయాలు ఉండగా ఈ రెండింటి ద్వారానే 40 శాతం ఆదాయం సమకూరుతుంది. గోపాలపట్నం, పెందుర్తి, ఆనందపురం, భీమిలి, పెదగంట్యాడ కార్యాలయాలు లక్ష్యంలో 50 శాతం కూడా దాటడం కష్టమే. ఈ తొమ్మిది నెలల్లో ఒక్క మే నెలలో మాత్రమే లక్ష్యం సమీపంలోకి రాగలిగారు.

ఓటర్ల పెరుగుదల

... 5వ పేజీ తరువాయి

నియోజకవర్గంలో 15,019 కొత్త ఓట్లు నమోదయ్యాయి. కాగా పశ్చిమలో 34,871, దక్షిణంలో 220,74, ఉత్తరంలో 19,339, తూర్పులో 18,448, భీమిలిలో 16,209, గాజువాకలో 15,144, పెందుర్తిలో 10,035 ఓట్లు తొలగించారు. ఇంకా 90,383 మంది ఓటర్లు సవరణకు దరఖాస్తు చేసుకున్నారు. విశాఖ తూర్పులో 20,868, ఉత్తరంలో 19,174, భీమిలిలో 15,479, గాజువాకలో 10,936, దక్షిణంలో 10,764, పశ్చిమలో 7,429, పెందుర్తిలో 5,733 ఓట్లు సవరణ చేశారు.

మాధవధార రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బ్రేకర్లు వేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మురళీనగర్, జనవరి 13 ; ఎట్టకేలకు జీవీఎంసీ ఇంజనీరింగ్ సిబ్బంది మాధవధార, మురళీనగర్ 48ఏ బస్సు రూట్‌లో స్పీడ్ బ్రేకర్లు వేశారు. గతనెలలో 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రధాన రహదారిలో కరువైన వేగ నియంత్రణ' పేరిట ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జీవీఎంసీ 15వ ఆర్థిక సంఘం నిధుల రూ. 9 కోట్ల ఖర్చుతో మాధవధార ఆర్అండ్‌బీ జంక్షన్ నుంచి మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీల మీదుగా 60 అడుగుల రోడ్డుని నవీకరించారు. ఈ సందర్భంగా పాత రోడ్డులో ఉన్న స్పీడు బ్రేకర్లను పూడ్చివేశారు. దీంతో యువత బైకు రేసులతో అలజడి రేపుడుతున్నారు. వీరి స్పీడ్‌కు పలువురు గాయాలపాలయ్యారు. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనదారులతోనూ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈనేపథ్యంలో ఇంజనీరింగ్ సిబ్బంది స్పందించారు. పాఠశాలలు, పలు ప్రభుత్వ విభాగాల కీలక ఆఫీసులు, నివాస ప్రాంతాలుగా ఉన్న మురళీనగర్ రోడ్డులో స్పీడు బ్రేకర్లు నిర్మించారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం భావ్యం కాదు

▸▸ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, జనవరి 13: ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించాలనుకోవడం భావ్యం కాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,066వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణను ఆపేందుకు తాము ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవరోధాలు సృష్టిస్తూ తమ పోరాటాలను, దీక్షలను ఆపాలనుకోవడం అవివేకమన్నారు. కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికుల పోరాటాలను అపహస్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఉక్కు కర్మాగారం ప్రజల సంపదని, దీనిని అమ్మే హక్కు ఎవరికీ లేదన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తే విశాఖ అభివృద్ధితో పాటు రాష్ట్రం కూడా తిరోగమనం వైపు పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్షలు

సీఎం జగన్ వైఖరిని నిరసిస్తూ నినాదాలు

పెందుర్తి, జనవరి 13: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు, ఆయాల నిరవధిక సమ్మె 33వ రోజుకు చేరింది.శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ మండలాలకు చెందిన అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో శిబిరానికి తరలి వచ్చారు. సీఎం జగన్ మొండివైఖరి వీడాలంటూ నినాదాలు చేశారు. దీక్షా శిబిరం సమీపాన మండల పరిషత్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన శిబిరంలో తొమ్మిదిమంది రిలేనిరాహార దీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. దేవి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. అనిత, జిల్లా అధ్యక్షురాలు బృంద, అంగన్‌వాడీ మండల శాఖ ప్రతినిధులు దేవి, లక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సుల తనిఖీ



షీలానగర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 13: సంక్రాంతి పండగ సందర్భంగా రవాణా శాఖ నిబంధనలను అతిక్రమించే ప్రైవేటు బస్సులపై సంబంధిత అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ మేరకు శనివారం ఉదయం షీలానగర్ జంక్షన్ వద్ద రవాణా శాఖ అధికారులు ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రైవేటు బస్సులను నిలిపేసి తనిఖీలు చేపట్టారు. ప్రైవేటు బస్సుల అనుమతి పత్రాలతో పాటు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారా? అన్న అంశాలను పరిశీలించారు. మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజారావు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు జరిపారు.

అయోధ్య శ్రీరాముని అక్షితలు పంపిణీ

కూర్మన్నపాలెం, జనవరి 13: జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెంలో శనివారం ఇంటింటికీ అయోధ్య శ్రీరాముని అక్షితలను పంపిణీ చేశారు. తొలుత రామాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నగర ఉపాధ్యక్షుడు బొండా ఎల్లాజీ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి అక్షితలు, అయోధ్య రామ విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను అందజేస్తున్నామన్నారు. ఈ నెల 22న అయోధ్యలో జరిగే రాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం రోజున ప్రజలంతా తమ ఇళ్లల్లో పూజలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కర్రి మూలయ్య, టి. పరదేశి, చిట్టి దేముడు, ఈశ్వరరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

16న రామాలయ వార్షికోత్సవం

పెదగంట్యాడ, జనవరి 13: ఏటా కనుమ రోజున నిర్వహించే నెల్లిముక్కు శ్రీరామాలయ వార్షికోత్సవాన్ని ఈ ఏడాది కూడా ఈ నెల 16న ఘనంగా నిర్వహించాలని ఆరు పంచాయతీలకు చెందిన పెద్దలు నిర్ణయించారు. ఈ ఉత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, పరసలను ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, జి.సత్యారావు, డి.సింహాచలం, పంచాయతీల పెద్దలు పులి రామిరెడ్డి, డి.పైడిరెడ్డి, ఎస్.సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)
- **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 20, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 50, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 52, బీరకాయలు 54, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 17, క్యారెట్ 32, దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 76, బరబాటి 38, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోసకాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 32, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 54, చిలగడదుంపలు 30, కంద 60, దేముడుచిక్కుడు 48, కొండ ఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	599
విజయనగరం	603
శ్రీకాకుళం	603

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	90
ఫారం ధర	--	110
విత్ స్కిన్	--	190
స్కిన్‌లెస్	--	200

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIIలో..



రాజులపాలెంలో పేరుకుపోయిన చెత్తాచెదారం



జీవీఎంసీ హెచ్చరికను బేఖాతరు చేస్తూ లక్ష్మీపురంలో వేసిన చెత్త

తరలని చెత్త.. వీడని దుర్వాసన

పారిశుధ్య కార్మికులు సమ్మె విరమించినా ఇబ్బందులు తప్పడం లేదని

87వ వార్డు ప్రజల ఆవేదన

కూర్మన్నపాలెం, జనవరి 13: జీవీఎంసీ 87వ వార్డు పరిధి లక్ష్మీపురం, రాజులపాలెం, వడ్లపూడిలలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు సమ్మె విరమించి మూడు రోజులైనా వార్డు పరిధిలోని ప్రధాన రహదారులు, కూడళ్లు చెత్తకుప్పలతో నిండిపోయి తీవ్ర దుర్గంధంతో నానాపాట్లు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వార్డు పరిధిలో ఎక్కడికక్కడ కుప్పలు కుప్పలుగా చెత్త పేరుపుపో వడం వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని వాపోతున్నారు. దీనివల్ల ఎక్కడ అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలుతాయోనని భీతిల్లు తున్నారు. చెత్తాచెదారాన్ని కుక్కలు, గేదెలు, ఆవులు చందరవందర చేస్తుండడంతో రహదారులన్నీ అధ్వానంగా మారుతున్నాయని, దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా ఉంటుందని పాదచారులు, ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి చెత్తాచెదారాన్ని తరలించేదుఉకు తగిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

71వ వార్డులో రోడ్డుపై పారిన మురుగు

శ్రీనగర్: గ్రేటర్ 71వ వార్డు పరిధి శ్రీనగర్ ప్రధాన రహదారిలో మురుగు నీరు ప్రవహించడంతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురయ్యారు. మురుగు ప్రవాహంతో తీవ్ర దుర్వాసన తలెత్తడంపై పారిశుధ్య సిబ్బంది స్పందించి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి మురుగు నీరు సజావుగా సాగేలా చర్యలు చేపట్టారు. అలాగే రోడ్డుపై ఉన్న చెత్తను,మురుగును మురుగును తొలగించారు.



మురుగుమయమైన శ్రీనగర్ ప్రధాన రహదారి

టీడీపీ కార్యాలయంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

భోగి మంటల్లో వివాదాస్పద జీవోలు దహనం చేసిన జిల్లా అధ్యక్షుడు 'పల్లా'

గాజువాక, జనవరి 13: తెలుగుదేశం పార్టీ గాజువాక కార్యాలయంలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన వివాదాస్పద జీవోలను నాయకులు భోగి మంటల్లో దహనం చేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి అని, త్వరలో ప్రజలకు మంచి రోజులు రానున్నాయన్నారు. రానున్న త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం సంక్రాంతి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, మొల్లి ముత్యాలనాయుడు, నాయకులు శివప్రసాద్,పెంటయ్య, గోమాడ వాసు, రాంబాయి. జయలత, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



వివాదాస్పద జీవోలను భోగి మంటల్లో దహనం చేస్తున్నా పల్లా శ్రీనివాసరావు

టీడీపీ విధానాలను ఇంటింటికీ చేర్చాలి

పెదగంట్యాడ: తెలుగుదేశం పార్టీ విధానాలు, ప్రణాళికలను ఇంటింటికీ చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధినేతలు చంద్రబాబు, లోకేశ్‌ల దిశానిర్దేశం మేరకు కార్యకర్తలంతా ఎన్నికలు ముగిసే వరకు పార్టీ కోసం శ్రమించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, నాయకులు పి.సోమునాయుడు, ఎం.పెంటయ్య, ఎస్.శ్రీనివాసరావు, యు.వెంకటరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి తిరువీధి ఉత్సవం

పెందుర్తి, జనవరి 13: స్థానిక వెంకటాద్రి శిఖరంపైనున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవి ఉత్సవమూర్తితో తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, గోవిందనామ స్మరణతో వెంకటాద్రి గిరిపై ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పెందుర్తి కూడలి నుంచి వెంకటాద్రి శిఖర వరకు తిరువీధి ఉత్సవం సాగింది. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మంది మహిళలు పండ్లు, వివిధ రకాలు స్వీట్లను అమ్మవారికి సారెగా తీసుకువచ్చి గోదాదేవికి సమర్పించారు. అలాగే శ్రీవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

వాంబేకాలనీ ఆలయంలో..

పెదగంట్యాడ: ధనుర్మాసం ఆఖరి శనివారం సందర్భంగా వాంబేకాలనీ స్వయంభు వేంకటేశ్వస్వామి ఆలయంలో శ్రీవారికి పారిజాత పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారికి దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, సింహాచల దేవస్థానం ట్రస్టీ దొడ్డి రమణ, కమిటీ సభ్యులు వెంకటసూరి అప్పారావు, దుర్గ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

అగనంపూడి: జీవీఎంసీ 79 వార్డు పరిధి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. 29వ పాశురాన్ని భక్తులకు చదివి వినిపించి దాని విశిష్టతను వివరించారు. కాగా ఆదివారం గోదా రంగనాథుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త ఈకే చారి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

శ్రీకృష్ణుని ఆలయంలో..



పుష్పాలంకరణలో గ్రీన్ సిటీ వేంకటేశ్వరస్వామి

శ్రీనగర్: గ్రేటర్ 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లోని శ్రీకృష్ణ గోవర్ధన ఆలయంలో గోవిం దరాజులస్వామిని పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు జరి పారు. శ్రీకృష్ణునికి పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, చందనం, విభూదీలతో అభిషేకాలు చేశారు. గోదాదేవి, ఆం డాళ్ అమ్మవారు, శ్రీరం గనాథుల వైభవం, తిరుప్పావై పఠనం గావిం చారు. ఆదివారం భోగి సందర్భంగా గోదాదేవి, రంగనాథుల కల్యాణాన్ని నిర్వహిస్తా మన్నారు. ఆలయ కమిటీ సభ్యులు సహదేవరావు, లక్ష్మణరాజు, శ్రీనివాస రాజు, తదితరులు పాల్గొన్నారు. 88వ వార్డు గ్రీన్‌సిటీ శ్రీలక్ష్మీ ఆండాళ్ సమేత వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి పుష్పయాగం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బండి సురేశ్‌కుమార్, వీవీ కృష్ణారావు, పద్మ, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



తిరువీధి ఉత్సవంలో గోదాదేవి అమ్మవారు

శేషాద్రి కొండపై..

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువుదీరిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారిని శోభాయమానంగా అలంకరించి స్వర్ణ పుష్పార్చన, పూజలు జరిపారు. ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని జరపనున్నారు. అలాగే వేపగుంట బీసీకాలనీలోని వేంకటేశ్వరాలయం, భరత్‌నగర్ సమీప శ్రీలక్ష్మీనరసింహనగర్‌లో గోపిజన వల్లభస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.



వాహన చోదకులకు గులాబీలు అందజేస్తున్న సీఐ, తదితరులు

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి: సీఐ భాస్కరరావు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 13: ట్రాఫిక్ నిబంధన లను వాహనదారులందరూ తప్పనిసరిగా పాటిస్తూ సంక్రాంతా సంబరాలను ఆనందంగా జరుపుకోవాలని గాజువాక శాంతిభద్రతల విభాగం సీఐ ఎల్.భాస్కరరావు అన్నారు. రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం షీలానగర్ సిగ్నల్ పాయింట్ ఫౌండేషన్ సిబ్బందితో పాటు పోలీసులు వాహనచోదకులకు రహదారి భద్రతా నియమాలను వివరించడంతో పాటు హెల్మెట్ ధరించినవాహనదారులకు గులాబీ పువ్వులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం: బెంబేలెత్తుతున్న ప్రజలు

జీవీఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

మల్కాపురం, జనవరి 13: పారిశ్రామిక ప్రాంతంలో కుక్కల స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఒంటరిగా వెళ్లే వారిపై శునకాలు వెంబడిస్తూ దాడి చేస్తున్నాయి. ఇటీవల కుక్కల దాడిలో సుమారు 20 మంది గాయపడ్డారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కుక్కకాటు బారిన పడి స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలకు వెళ్తే సరైన వైద్యం అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ర్యాబిస్ వ్యాక్సిన్ కూడా దొరకడం లేదు. ఈ వ్యాక్సిన్‌లను రప్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కనీస ప్రయత్నం కూడా చేయడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా తెల్లవారుజామున వ్యాయామానికి ఒంటరిగా వెళ్లే వారిపై కుక్కలు వెంటపడుతున్నాయి. గతంలో జీవీఎంసీ సిబ్బంది కుక్కలను పట్టుకొని దూరప్రాంతాల్లో వదిలేవారు. ఇప్పుడు ఆ ప్రక్రియను విడిచిపెట్టేశారు. ఫలితంగా కుక్కలు సంఖ్య వార్డుల్లో గణనీయంగా పెరిగిపోయింది. ఇకనైనా జీవీఎంసీ అధికారులు స్పందించి కుక్కలను నిరోధించాలని పలువురు కోరుతున్నారు.



గుంపుగా ఉన్న కుక్కలు



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ప్రధాన రహదారి

స్తంభించిన గోపాలపట్నం ప్రధాన రహదారి

కొనుగోలుదారులతో కిటకిటలాడిన దుకాణాలు

గోపాలపట్నం, జనవరి 13: సంక్రాంతి పండను పురస్కరించుకుని కొనుగోలుదారులతో గోపాలపట్నం ప్రధాన రహదారి స్తంభించిపోయింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు కూడళ్లన్నీ జనాలతో కిటకిటలాడాయి. షాపింగ్‌మాల్స్‌లో కొనుగోలుదారుల రద్దీ విపరీతంగా ఉంది. వ్యాపార సముదాయాలకు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను పార్కింగ్ చేసేందుకు ప్రదేశాలు లేక ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న లింక్ రోడ్లలో నిలిపివేశారు. దీంతో ఆయా రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నగరం నుంచి వచ్చే వాహనాలను సదరం అప్పలనాయుడు మార్గంలోకి మళ్లించారు.

జోరుగా ఫుట్‌పాత్ వ్యాపారం

గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఏటా పండగ సమయంలో ఉత్తరాది ప్రాంతాల నుంచి రెడీమేడ్ దుస్తులు తెచ్చి ఫుట్‌పాత్‌పై విక్రయిస్తుంటారు. చిన్న దుకాణాల్లో మాత్రం వ్యాపారం అంతగా సాగడం లేదు. పండగ నేపథ్యంలో పూజా సామగ్రి, ఇతర నిత్యావసరాల కొనుగోలుదారులతో రైతుబజారు రద్దీగా మారింది. సాధారణ రోజుల్లో రోజుకు సుమారు రెండువేల మందికి పైగా రాగా పెద్ద పండగ కావడంతో శనివారం సుమారు ఐదు వేల మందికి పైగా కొనుగోలుదారులు రైతు బజారుకు వచ్చారు.

వేద పాఠశాల స్థలంలో కోనేరు తవ్వకం తగదు

పెందుర్తి, జనవరి 13: స్థానిక వెంకటాద్రి శిఖర మార్గం దిగువన మాహాకామేశ్వరీ సహిత ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయం సమీపంలో ప్రభుత్వం మంజూరు చేసిన బ్రాహ్మణ వేద పాఠశాల, సామాజిక భవనానికి చెందిన స్థలంలో వెంకటాద్రి ఆలయ అర్చకుడు మహర్షి రామానుజుచార్యులు కోనేరు తవ్వకం కోసం రెచ్చగొట్టే చర్యలకు దిగుతున్నారని మహాకామేశ్వరీ ఆలయ కమిటీ చైర్మన్ దవళ యజ్ఞేశ్వర శైనులు ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ స్థలంపై హై కోర్టులో వ్యాజ్యాలు కొనసాగుతున్నప్పటికీ అర్చకుడు కోనేరు నిర్మాణానికి సిద్ధం కావడం తగదన్నారు. సదరు అర్చకునిపై జిల్లా రెవెన్యూ అధికారులు ,పెందుర్తి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు.



పాత గాజువాకలో బస్సుల కోసం వేచివున్న ప్రజలు

సంక్రాంతికి చలో చలో స్వగ్రామాలకు..

సొంతూర్లకు పయనమవుతున్న పారిశ్రామిక ప్రాంత వాసులు

గాజువాక, జనవరి 13: సంక్రాంతి పండగ నేపథ్యంలో గాజువాక పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారంత తమ సొంతూళ్లకు పయనమవుతున్నారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో వివిధ పరిశ్రమలు ఉండటంతో ఉత్తరాంధ్రకు చెందిన వారితో పాటు ఏపీ, ఇతర రాష్ట్రాలకు చెందినవారు ఇక్కడ విధులు నిర్వహిస్తూ నివాసం ఉంటున్నారు. ఇప్పుడు వారంతా పెద్ద పండగ దృష్ట్యా తమ సొంతూళ్లకు వెళ్లెందుకు సిద్ధమవ్వడంతో పాత గాజువాక బస్టాప్ ప్రయాణికులతో శనివారం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. దీంతో బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు జనంతో కిటకిటలాడాయి. కాగా గాజువా పరిసర ప్రాంత వాసులు అధిక సంఖ్యలో తమ స్వగ్రామాలకు తరలివెళ్లడంతో ఆయాచోట్ల పోలీసులు పటిష్ఠ నిఘా పెట్టారు.

రక్తదానంతో మరో ముగ్గురికి ప్రాణ దానం

బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

గాజువాక, జనవరి 13: రక్తదానం చేయటం ద్వారా ఆపదలో ఉన్న మరో ముగ్గురికి ప్రాణ దానం చేయవచ్చని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ఈ నెల 28న హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో గాజువాకలో నిర్వహించనున్న రక్తదాన శిబిరం పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. రక్తదానంపై ఇప్పటికీ చాలామందికి అపోహలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేసేందుకు చదువుకున్న యువత ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, రాఘవ, విజయకుమార్, రమేశ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో సంక్రాంతి సంబరాలు

వేపగుంట జనవరి 13: నాయుడుతోటలోని సాయిమాధవనగర్ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో సంక్రాంతి సంబరాలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు క్రికెట్, బాడ్మింటన్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు సంస్థ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్, జీఎం రాధాకృష్ణన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నశ్రిన్, శిరీష, చల్లా, కృష్ణ, డీజీఎం కె.బంగార్రాజు, వేణుగోపాల్, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

యువత దళారులను నమ్మొద్దు: మేయర్

విశాఖపట్నం, జనవరి 13: జీవీఎంసీలోని ప్రజారోగ్య విభాగంలో శానిటరీ సూపర్‌వైజర్ల ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్టు కొంతమంది దళారులు నిరుద్యోగుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని, వాటిని ఎవరూ నమ్మరాదని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజారోగ్య విభాగంలో ఎటువంటి పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ఉద్యోగాల కోసం ఎటువంటి డబ్బులు చెల్లించరాదని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, తదితరులు

పెదగంట్యాడ, జనవరి 13: నియోజకవర్గం పరిధిలోని అన్ని వార్డుల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 76వ వార్డు పరిధి స్వతంత్రనగర్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు, రూ.15.03 లక్షలతో బాలచెరువు శివాలయానికి ప్రహరీ నిర్మించేందుకు, రూ.12 లక్షలతో భరత్‌నగర్‌లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల ఏర్పాటుకు, రూ.15.73 లక్షలతో వార్డులోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు చే సేందుకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ గంధం శ్రీనివాస్ మాట్లాడుతూ వార్డును మరింత అభివృద్ధి చేసేందుకు జీవీఎంసీ నుంచి అధిక నిధులు తెస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు, సింహాచలం దేవస్థానం ట్రస్టీ దొడ్డి రమణ, కార్మిక నాయకుడు జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

అక్కిరెడ్డిపాలెం: గ్రేటర్ 69 వార్డులో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పరిశీలించారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో నాతయ్యపాలెంలో నిర్మిస్తున్న గ్రేటర్ వార్డు కార్యాలయ నిర్మాణ పనులను, సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న తుంగ్లాం కల్యాణ మండప పనులను ఆయన పరిశీలించారు. ఆయా పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయన అధికారులు, కాంట్రక్టరును కోరారు. ఆయన వెంట నాయకులు గోపిశెట్టి గోపి, అక్కిరెడ్డి శ్రీను, ఎస్.సింహాచలం, తదితరులు ఉన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేత

గోపాలపట్నం, జనవరి 13: సంక్రాంతి పండను పురస్కరించుకుని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు శనివారం బహుమతులను అందజేశారు. కొత్తపాలెంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆనంద్ కుమార్ సోదరి, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి విజేతలకు బహుమతులు అందజేశారు. కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, అయితంశెట్టి సత్యవతి, కొత్తపాలెం పీఏసీఎస్ మాజీ చైర్మన్ అయితంశెట్టి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 91, 92 వార్డుల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు బహుమతులు అందజేశారు.

రామ్‌నగర్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

అక్కిరెడ్డిపాలెం: సంక్రాంతి పండగ సందర్భంగా ఇక్కడి రామ్‌నగర్ పీహెచ్‌సీ వద్ద శనివారం నిర్వహించిన ముగ్గులపోటీలను కార్పొరేటర్ గుడివాడ అనూష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి ముగ్గులు,గొబ్బెమ్మలు, ఇతర సంప్రదాయాలను నేటి యువత మరిచిపోరాదన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఉరుకూటి చందు, గుడివాడ లతీశ్, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో సుదర్శన హవనం

సింహాచలం, జనవరి 13: అప్పన్న కొండ దిగువ పూదోటలోని వేంకటేశ్వరస్వామి సన్నిదిలో శనివారం సంప్రదాయబద్ధంగా సుదర్శన హవనం నిర్వహించారు. ప్రతినెలా శ్రీవారి ఆవిర్భావ నక్షత్రం శ్రవణం రోజున సుదర్శన హవనాన్ని నిర్వహిస్తారు. ఈ మేరకు స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

సొంత ఊళ్లకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి

» పోలీసు అధికారుల సూచన

సీతంపేట, జనవరి 13: సంక్రాంతి పురస్కరించుకొని సొంత ఊళ్లకు వెళ్లే వారు ఇళ్లల్లో చోరీలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ విజయ్‌కుమార్, ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ రమేశ్ సూచించారు. తమ స్టేషన్ల పరిధిలోని వారు ఎవరైనా ఊరు వెళ్లితే స్టేషన్‌కు వచ్చి ఇంటి చిరునామా, తదితర సమాచారం అందించాలన్నారు. ఇంటికి సీసీ కెమెరాలుంటే మొబైల్ ద్వారా ఎక్కడినుంచి అయినా పర్యవేక్షించ వచ్చన్నారు. ఊరుకు వెళ్లే సమయంలో తమ ద్విచక్రవాహనాలను రహదారులపైవదిలి వెళ్లొద్దన్నారు. సురక్షిత ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలన్నారు. ఇళ్ల కిటికీలు, తలుపులకు కచ్చితంగా తాళం వేయాలన్నారు. రెండు రోజులకోసారి ఇంటి పక్కనున్న ఉన్న వారితో మాట్లాడాలన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

పండగ సందర్భంగా ఎవరైనా విచ్చలవిడిగా రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠినచర్యలు తీసుకుంటామని సీఐలు హెచ్చరించారు. ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా తమ ప్రాణాలతోపాటు ఎదుటివారికీ ముప్పు తెచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే... పోలీసు స్టేషన్లకు లేదా, 100కి, 112 నంబర్లకు సమాచారమివ్వాలని పేర్కొన్నారు.

తాగునీటి సమస్యపై ఫిర్యాదు



కార్పొరేటర్ అప్పలరత్నంకు సమస్య వివరిస్తున్న కుమ్మరవీధి మహిళలు

జగదాంబ కూడలి, జనవరి 13: జీవీఎంసీ కొళాయిల ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా కాక ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు 30వ వార్డు కుమ్మరవీధి ప్రాంతానికి చెందిన మహిళలు కార్పొరేటర్ కోడూరి అప్పలరత్నంకు ఫిర్యాదు చేశారు. శనివారం స్థానిక పోలమాంబ అమ్మవారి జాతరకు సంబంధించి ఏర్పాట్ల పరిశీలన కార్పొరేటర్ వచ్చారు. ఈసందర్భంగా మహిళలుకొళాయి నీటి సరఫరాలో సమయపాలన ఉం డడం లేదని వివరించారు. బిందెడు నీరు నిండేందుకే చాలా సమయం పడుతుందన్నారు. దీనిపై కార్పొరేటర్ స్పందించి... వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడారు. సమస్య సరిచేయాలని ఆదేశించారు.శ్రీ పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు స్థానిక సమస్యలపై కార్పొరేటర్‌కు వినతులు అందజేశారు. వైసీపీ సీనియర్ నాయకుడు పెంటపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు వితరణ



నిత్యావసరాలందిస్తున్న చారిటీ బాక్స్ సభ్యులు

మహరాణిపేట, జనవరి 13: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని చారిటీ బాక్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పేదలకు నిత్యావసరవస్తువులు, నూతన దుస్తులు పంపిణీ చేశారు. మహరాణిపేట, పాత పోస్టాఫీసు, పెదవాల్తేర్, తాటిచెట్లపాలెం తదితర ప్రాంతాల్లో నిరాశ్రయులను గుర్తించి వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి తాడికొండ కరుణాకరణ, లక్కోజు నూకరాజు, కే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



తుది దశలో మాధవధార శంకరనారాయణ రహదారి



నిర్మాణంలో ఉన్న కళింగనగర్ రోడ్డు

చురుగ్గా సీసీ రహదారుల నిర్మాణం

» మురళీనగర్, మాధవధార కాలనీల్లో కొత్త రూపు

మాధవధార, జనవరి 13; ఉత్తర నియోజకవర్గ పరిధిలోని మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో మెయిన్ రోడ్లకు అనుసంధానంగా ఉన్న రహదారులు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. అన్ని వీధుల్లో బీటీ, లేకుంటే సిమెంట్ కాంక్రీటు రోడ్లతో కొత్త మార్గాలను రూపొందిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆఘమేఘాల మీద రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. స్థానికులను సీసీ రోడ్డా.. తారు రోడ్డు వేయాలా? అని సంతకాల ద్వారా అభిప్రాయాలు తెలుసుకుని మరీ పనులు జరుపుతున్నారు. మార్గాల పక్కన మొక్కలు ఉంచాలా? వద్దా అనే అంశాలను తెలుసుకుని పూర్తిచేస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్లకు చేతి నిండా పని దొరుకుతోంది. అధికారులూ బిజీ అయ్యారు. నాయకులు ఇన్ని రూ. కోట్లతో మీ వార్డుని అభివృద్ధి చేస్తున్నామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఏ కారణంతోనైనా రాకపోకలకు తమ కష్టాలు తీరుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పూర్ణామార్కెట్ వద్ద ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపులో వన్‌టౌన్ సీఐ షణ్ముఖరావు

పూర్ణామార్కెట్, జనవరి 13: పూర్ణామార్కెట్ ట్రాఫిక్ నియంత్రణపై వన్‌టౌన్ పోలీసులు దృష్టి సారించారు. ప్రధానంగా పార్కింగ్ స్థలం, రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు జరపడంతో సమస్యలు నెలకొంటున్నాయి. మెయిన్ రోడ్డు నుంచి దుర్గాలమ్మ గుడికి వెళ్లే రహదారి ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంది. దీంతో గత రెండురోజులుగా కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. దీంతో వర్తక సంఘం ప్రతినిధులు వన్‌టౌన్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ, ఎస్ఐ విశ్వనాథ్ రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై శనివారం చర్యలకుదిగారు. పార్కింగ్ స్థలం వద్ద అడ్డంగా ఉన్న దుకాణాలను తొలగించారు. రహదారులపై తోపుడు బండ్లను నియంత్రించారు. ట్రాఫిక్ నియంత్రించి పోలీసులు వెళ్లిన వెంటనే తిరిగి వేరేచోట్ల వ్యాపారాలను సాగించడం విశేషం. అలాగే, సంక్రాంతి నేపథ్యంలో మార్కెట్‌లో మేడపైన వ్యాపారాలు సాగించే వ్యాపారులను రోడ్డుమీదకు అనుమతించడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

టీడీపీ గెలుపునకు సమష్టి కృషి

» ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు



జయహో బీసీ సభలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

అక్కయ్యపాలెం, జనవరి 13: బీసీలంతా సమష్టిగా టీడీపీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టీడీపీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి చిక్కాల విజయ్‌బాబు, పరిశీలకుడు రాజాన రమేష్ పిలుపునిచ్చారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 45వ వార్డు అధ్యక్షుడు భరణికాన రాజు ఆధ్వర్యంలో శనివారం శివశంకర రజక కాలనీలోని సామాజిక భవనంలో జయహో బీసీ పేరిట సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వారు హాజరై ప్రసంగించారు. వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ శ్రేణులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తమ్మిన విజయ్‌కుమార్, అనసూరి మధు, గొలగాని సౌజన్య, షేక్ బాబ్జీ, పలిశెట్టి అప్పన్న, వాసుపల్లి రాజు, ఈతలపాక సుజాత, అకిరెడ్డి జగదీష్ పాల్గొన్నారు.

కిల్లాడ సత్యనారాయణ సాహిత్య కృషి భేష్

» 'ఆత్మచిత్రం' పుస్తకావిష్కరణ సభలో సీపీ రవిశంకర్



పుస్తకావిష్కరణలో సీపీ డాక్టర్ రవిశంకర్, సాహితీవేత్తలు

సీతంపేట, జనవరి 13: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శ్రీ విశ్వ కళ్యాణ భారతి సేవా సంఘం ఆధ్వర్యంలో కవి, వ్యాసకర్త,అనువాదకులు , సీబీసీఐడీ ఏడీజీ (లక్నో) కిల్లాడ సత్యనారాయణ రచించిన ఆత్మచిత్రం పుస్తకాన్ని అడిషనల్ డీజీపీ, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆవిష్కరించారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి డాక్టర్ కేదార్నాథ్ సింగ్ రచనల్లో ఎంపిక చేసిన 100 కవితలను అనువాదం చేసి ఆత్మ చిత్రం పేరిట పుస్తకం రచించారు. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మాట్లాడుతూ, సత్యనారాయణ పోలీసు శాఖలో ఉన్నతోద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ.. మరోవైపు సాహిత్యాభిలాష కొనసాగించడం గొప్పవిషయమన్నారు. కేదార్నాథ్ సింగ్ కవితలను అనువదించి తెలుగువారికి పరిచయం చే యడం హర్షణీయమన్నారు. కేదార్నాథ్ సింగ్ ప్రముఖ విమర్శకుడు, వ్యాసకర్త కూడా అని ఆయన వివరించారు. పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ పీహెచ్‌డీ డాక్టర్ బీపీఎస్ కళ్యాణి, గీతం యూనివర్శిటీ ఇంగ్లిష్ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, కొత్తగూడెంకు చెందిన రచయిత భగవతం, సాహితీ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ రవిశంకర్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 13: వాల్తేరు రైల్వే గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న మార్వాడీ క్రికెట్ పోటీలను శనివారంనగర పోలీసు కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యర్, గ్రేహౌండ్స్ ఐజీ రాజీవ్ మీనా ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ఆరేళ్ల నుంచి క్రమం తప్పకుండా సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తూ యువ క్రీడాకారులను ప్రోత్సహించడం విశేషమని పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీ జరగనుంది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజేష్ పగరియా, హరష్ప పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత గండి బాబ్జీ

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని 39వ వార్డు ఫెర్రీ రోడ్‌వద్ద శనివారం రాత్రి సుమారు 200 మంది పేదలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ నిత్యావసర సరకులు అందజేశారు. సంక్రాంతి పురస్కరించుకుని బియ్యం, పప్పులు, కూరగాయలు తదితరవాటిని అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ పేద వర్గాలు ఆనందంగా పండగ జరుపుకోవాలని ఈ వస్తుసామగ్రి పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లడ్డా బాయ్, వాసుపల్లి దానేశు, మైలపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి శర్మ



సాంకేతిక పర్యవేక్షకునిగా నియమితులైన శర్మ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 13: వరల్డ్ చాంపియన్‌షిప్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి నగరానికి చెందిన బ్లూ బ్యాడ్జీ ఇంటర్నేషనల్ అంపైర్, ఎల్ఐసీ ఉద్యోగి డాక్టర్ డీవీఎస్‌వై శర్మ సాంకేతిక పర్యవేక్షకునిగా నియమితులయ్యారు.ఈ మేరకు భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య జారీ చేసిన దేశంలోని అత్యుత్తమ పది మంది అంపైర్ల జాబితాలో శర్మ ఒకరు కావడం విశేషం. గోవాలో ఈనెల 23 నుంచి జరిగే ఈ టోర్నీకి శర్మ ప్రధాన అంపైర్లలో ఒకరిగా వ్యవహరించనున్నారు. శర్మ టేబుల్ టెన్నిస్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, జిల్లా కార్యదర్శిగా, ఎల్ఐసీ స్పోర్ట్సు బోర్డు మెంబరుగా కూడా సేవలందిస్తున్నారు. వరల్డ్ టెన్నిస్ పర్యవేక్షకునిగా ఎన్నిక కావడంపై ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్, మేనేజర్ పర్సనల్ భగవాన్ ప్రసాద్, ఉద్యోగుల సంఘ నాయకులు ఎం.కామేశ్వరి, వరప్రసాద్‌తోపాటు టేబుల్ టెన్నిస్ సంఘం ప్రతినిధులు, కోచ్‌లు తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

జిల్లా వాసులకు కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు

మహరాణిపేట, జనవరి 13: తెలుగువారి సంప్రదాయాలకు అద్దంపట్టే సంక్రాంతి ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని కలెక్టర్ ఏ మల్లికార్జున ఆకాంక్షించారు. సంక్రాంతి శుభవేళ మేలు చేకూరాలని, జిల్లా వాసులకు శుభాకాంక్షలు తెలిపారు.

కిటకిటలాడిన రైతుబజారు



నరసింహనగర్ రైతుబజారులో రద్దీ

అక్కయ్యపాలెం, జనవరి 13: సంక్రాంతికి సంబంధించిన పూజా సామగ్రి, కూరగాయలు కొనుగోలుకు వచ్చిన వారితో నరసింహనగర్ రైతుబజారు శనివారం కిక్కిరిసింది. చెరకు గెడలు, వివిధ రకాల పండ్లు, తదితర సామగ్రి కొనుగోలుచేశారు. ఉదయంనుంచి రైతుబజారులో అన్ని స్టాల్స్ కిటకిటలాడాయి.

వైసీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా రమణికుమారి

మురళీనగర్, జనవరి 13 ; వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా మాధవధారకు చెందిన పేడాడ.రమణికుమారి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు అందినట్లు ఆమె తెలిపారు. పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పటిష్టతకు పనిచేస్తానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. తనకీ పదవి వచ్చేలా సహకరించిన పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డి, స్పీకర్ టి.సీతారామ్, విశాఖనగర అధ్యక్షులు కె.గురువులుతదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం భావ్యం కాదు

» ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, జనవరి 13: ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించాలనుకోవడం భావ్యం కాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,066వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణను ఆపేందుకు తాము ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవరోధాలు సృష్టిస్తూ తమ పోరాటాలను, దీక్షలను ఆపాలనుకోవడం అవివేకమన్నారు. కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికుల పోరాటాలను అపహాస్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఉక్కు కర్మాగారం ప్రజల సంపదని, దీనిని అమ్మే హక్కు ఎవరికీ లేదన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తే విశాఖ అభివృద్ధితో పాటు రాష్ట్రం కూడా తిరోగమనం వైపు పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తండ్రి అస్థికలు గోదావరిలో కలిపి వస్తూ

తిరిగిరాని లోకాలకు..

తాళ్లపాలెం వద్ద కారు బోల్తా పడి వ్యక్తి మృతి

ముగ్గురికి తీవ్రగాయాలు



తాళ్లపాలెం వద్ద బోల్తా పడిన కారు. (ఇన్‌సెట్లో) మృతి చెందిన భాస్కరరావు (ఫైల్)

కశింకోట, జనవరి 13: తండ్రి అస్థికలను గోదావరిలో నిమజ్జనం చేసి తిరిగి వస్తుండగా కారు అదుపుతప్పి బోల్తాపడడంతో కుమారుడు మృతి చెందిన విషాదకర సంఘటన శనివారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో కుమారుడితోపాటు ముగ్గురు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పరవాడ మండలం ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీకి చెందిన రిటైర్డ్ కానిస్టేబుల్ ఈతా నారాయణరావు ఈ నెల పదో తేదీన మృతిచెందారు. అంత్యక్రియలు పూర్తయిన తరువాత అస్థికలను గోదావరిలో నిమజ్జనం చేయాలని కుటుంబ సభ్యులు భావించారు. నారాయణరావు కుమారులు వాసుదేవరావు, భాస్కరరావు (40)తోపాటు దగ్గర బంధువులు ఈతా మురళీగణేశ్, రెడ్డిపల్లి వెంకటరావు, రాచపల్లి గిరిశ్ అచ్యుతకుమార్ కలిసి కారులో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత రెండు గంటల సమయంలో రాజమహేంద్రవరం బయలుదేరారు. శనివారం ఉదయం ఆరు గంటలకు అక్కడకు చేరుకుని, అస్థికలను గోదావరిలో నిమజ్జనం చేసిన అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. అచ్యుతకుమార్‌కు చెందిన కారును (ఎర్టిగా) వాసుదేవరావు డ్రైవ్ చేస్తున్నారు. ఉదయం 8.45 గంటల ప్రాంతంలో తాళ్లపాలెం సమీపంలో బ్రిడ్జి వద్ద కారు అదుపుతప్పింది. ఎడమవైపున ఉన్న రక్షణ స్తంభాలను ఢీకొని కిందకు దూసుకువెళ్లి బోల్తా పడింది. దీంతో గిరిశ్ అచ్యుతకుమార్ మినహా మిగిలిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. భాస్కరరావు పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. మిగిలిన ముగ్గురు ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గిరీష్ అచ్యుతకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ సుందరమ్మ తెలిపారు.

వైసీపీ నేత రుబాబు

... 5వ పేజీ తరువాయి

ఆ మేరకు భవనాన్ని తొలగించి స్థలం స్వాధీనం చేసుకోవాల్సి ఉన్నా, అధికార పార్టీకి చెందిన నేత కావడంతో ఇంతవరకూ ఆ పనిచేయలేకపోయారు. ఒకసారి భవనాన్ని తొలగించేందుకు యత్నించినా అధికార పార్టీలో పైస్థాయి నాయకుడు అడ్డంపడడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఇదిలావుండగా తాజాగా అదే భవనంపై అదనపు అంతస్థు నిర్మాణం ప్రారంభించారు. ఈ సమాచారం తెలిసి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వెళ్లారు. అదనపు అంతస్థు పనులను అడ్డుకున్నారు. దీంతో భవన యజమానికి సంబంధించిన వ్యక్తులు వారిపై తిరగబడడంతో భయపడిపోయి, తమ పైఅధికారులకు సమాచారం ఇచ్చారు. ఏసీపీ షణ్ముంశాస్త్రితోపాటు స్వయంగా సీసీపీ బి.సురేష్‌కుమార్ అక్కడకు వెళ్లినప్పటికీ భవన యజమానితోపాటు ఆయనకు సంబంధించిన వ్యక్తుల రుబాబు తగ్గలేదు. తాను నిర్మాణ పనులను ఆపేది లేదంటూ పనులు కొనసాగించడంతో ఏసీపీ షణ్ముంశాస్త్రి పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావించారు. కానీ ఏమైందోగానీ ఇంతవరకూ పోలీసులకు ఫిర్యాదు అందకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అధికార పార్టీ నేత అయిన సదరు భవన యజమానికి నియోజకవర్గ స్థాయి నేతల అండదండలు ఉండడం వల్లే టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుకొచ్చిన గొడవని మౌనం దాల్చినట్టు తెలిసింది. సామాన్యుల విషయంలో నిబంధనల పేరుతో చెలరేగిపోయే టౌన్‌ప్లానింగ్ అధికారులు...టీడీఆర్ జారీచేసినా స్థలాన్ని ఇంతవరకూ స్వాధీనం చేసుకోకపోవడం, అదనపు అంతస్థు నిర్మిస్తున్నా చోద్యం చూడడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రియల్ ధమాల్

... 5వ పేజీ తరువాయి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో మధురవాడ, సూపర్‌బజార్ కార్యాలయాల్లో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. వీటిలో ఒక్కొక్కచోట నెలకు రూ.15 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. తొమ్మిది కార్యాలయాలు ఉండగా ఈ రెండింటి ద్వారానే 40 శాతం ఆదాయం సమకూరుతుంది. గోపాలపట్నం, పెందుర్తి, ఆనందపురం, భీమిలి, పెదగంట్యాడ కార్యాలయాలు లక్ష్యంలో 50 శాతం కూడా దాటడం కష్టమే. ఈ తొమ్మిది నెలల్లో ఒక్క మే నెలలో మాత్రమే లక్ష్యం సమీపంలోకి రాగలిగారు.

ఓటర్ల పెరుగుదల

... 5వ పేజీ తరువాయి

నియోజకవర్గంలో 15,019 కొత్త ఓట్లు నమోదయ్యాయి. కాగా పశ్చిమలో 34,871, దక్షిణంలో 220,74, ఉత్తరంలో 19,339, తూర్పులో 18,448, భీమిలిలో 16,209, గాజువాకలో 15,144, పెందుర్తిలో 10,035 ఓట్లు తొలగించారు. ఇంకా 90,383 మంది ఓటర్లు సవరణకు దరఖాస్తు చేసుకున్నారు. విశాఖ తూర్పులో 20,868, ఉత్తరంలో 19,174, భీమిలిలో 15,479, గాజువాకలో 10,936, దక్షిణంలో 10,764, పశ్చిమలో 7,429, పెందుర్తిలో 5,733 ఓట్లు సవరణ చేశారు.

మాధవధార రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బ్రేకర్లు వేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మురళీనగర్, జనవరి 13 ; ఎట్టకేలకు జీవీఎంసీ ఇంజనీరింగ్ సిబ్బంది మాధవధార, మురళీనగర్ 48ఏ బస్సు రూట్‌లో స్పీడ్ బ్రేకర్లు వేశారు. గతనెలలో 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రధాన రహదారిలో కరువైన వేగ నియంత్రణ' పేరిట ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జీవీఎంసీ 15వ ఆర్థిక సంఘం నిధుల రూ. 9 కోట్ల ఖర్చుతో మాధవధార ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీల మీదుగా 60 అడుగుల రోడ్డుని నవీకరించారు. ఈ సందర్భంగా పాత రోడ్డులో ఉన్న స్పీడు బ్రేకర్లను పూడ్చివేశారు. దీంతో యువత బైకు రేసులతో అలజడి రేపుడుతున్నారు. వీరి స్పీడ్‌కు పలువురు గాయాలపాలయ్యారు. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనదారులతోనూ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈనేపథ్యంలో ఇంజనీరింగ్ సిబ్బంది స్పందించారు. పాఠశాలలు, పలు ప్రభుత్వ విభాగాల కీలక ఆఫీసులు, నివాస ప్రాంతాలుగా ఉన్న మురళీనగర్ రోడ్డులో స్పీడు బ్రేకర్లు నిర్మించారు.

నేరాల నియంత్రణకు చర్యలు

ఎంవీపీ కాలనీ, జనవరి 13 : పండగలో జరిగే నేరాల నియంత్రణకు పోలీసులు పలు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు నార్త్ సబ్ డివిజన్‌లోని పలు స్టేషన్ల నుంచి 25 మంది సిబ్బందిని ఎంవీపీ స్టేషన్ పరిధిలో నిఘాకు వినియోగిస్తున్నారు. శనివారం రాత్రి వారు వివిధ ప్రాంతాల్లో నిఘా ఉంచడంతో పాటు అక్కడి పరిస్థితులను అవగాహన చేసుకోవడం, ప్రజల్లో అవగాహన కల్పించడం చేశారు.ఎస్ఐ రాందాస్ ఆధ్వర్యంలో వారంతా ఈవిధులు నిర్వర్తిస్తున్నారు. పండగకు నగరవాసులు ఎక్కువగా ఇళ్లకు తాళాలు వేసి, ఊర్లకు వెళుతుంటారు. ఈ సమయంలో ఎక్కువగా చోరీలు జరుగుతుంటాయి. వీటి నియంత్రణకు పోలీసులు ఇప్పటికే కరపత్రాలు, ఆటోలో మైకు ద్వారా ప్రచారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

పతంగుల పోటీలు రేపు

భీమునిపట్నం, జనవరి 13 : స్థానిక లైట్ హౌస్ వద్ద సోమవారం పతంగుల పోటీలు నిర్వహించనున్నట్టు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి సభ్యులు తెలిపారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు పోటీలు జరుగుతాయని, యువత ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

విశాలాక్షినగర్, జనవరి 13 : విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా భావాన్ని కూడా పెంపొందించుకోవాలని యాక్స్ డిగ్రీ కళాశాల కోశాధికారి గార సత్యనారాయణ సూచించారు. జోడుగుళ్లపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ రాజారావు, కరస్పాండెంట్ జంగాలయ్య, ప్రిన్సిపాల్ ఎం. పద్మారావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ప్రమీల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి. సతీష్ పాల్గొన్నారు.

నగరపాలెంలో ఓపెన్ జిమ్

తగరపువలస, జనవరి 13 : నగరపాలెం గ్రామంలో దివీస్ యాజమాన్యం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను శనివారం ఆ కంపెనీ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని యువత ప్రతిరోజూ వ్యాయామం చేయడానికి వీలుగా రూ. 2.50 లక్షలు విలువైన పరికరాలు ఏర్పాటు చేశామని చెప్పారు.వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుస్తులు పంపిణీ

భీమునిపట్నం (రూరల్), జనవరి 13 : మండలంలోని రేఖవానిపాలెం పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ శ్రీనివాసరావు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ వీధులను శుభ్రపరుస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించడం సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీ

భీమునిపట్నం/వెంకోజీపాలెం, జనవరి 13 : బీచ్ రోడ్‌లోని పైలాన్ వద్ద ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీ నిర్వహించారు. పోటీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పీరుపల్లి సుగుణ, చింతపల్లి మణి,కాసరపు దేవీకుమారి మొదటి మూడు స్థానాల్లో గెలుపొందారు. అలాగే సంప్రదాయ వస్త్రధారణ పోటీలో సిరి ఆరోహి, తెడ్డు లక్ష్మీప్రసన్న, కర్రి సాత్విక విజేతలుగా నిలిచారు. కాగా కొత్త వెంకోజీపాలెంలోని సద్గురు సాయి మందిరం మార్గంలో గణేష్ పెటిల్ బ్యాడ్మింటన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీ నిర్వహించనున్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు



మధురవాడ, జనవరి 13 : మధురవాడ శిల్పారామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన కళారాధన డ్యాన్స్ అకాడమీ కళాకారులు అక్షయ, నివేదిత, మోనిషారెడ్డి, గాయత్రి, భాగశ్రీ పలు గీతాలకు నృత్యరీతులు సమకూర్చారు.

సినిమా గైడ్

● **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)

● **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

● **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23,టమాటా 20, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 50, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 52, బీరకాయలు 54, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 17, క్యారెట్ 32, దొండకాయలు 20, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 110, బరబటి 38, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోస కాయలు 36, వె ల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 32 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 54, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 48, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	599
విజయనగరం	603
శ్రీకాకుళం	603

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	90
ఫారం ధర	--	110
విత్ స్కిన్	--	190
స్కిన్‌లెస్	--	200

మరికొన్ని సిటీ వార్తలు పేజీ III లో..



కనువిందు చేస్తున్న పచ్చదనం, నడకదారిలో నిర్మించిన పగోడా



పార్కులో ఏర్పాటు చేసిన చిన్న పిల్లల ఆట వస్తువులు

ప్రారంభోత్సవానికి సిద్ధంగా పార్కు

- స్వతంత్రనగర్ కాలనీలో రూ. 4 కోట్లతో నిర్మాణం
- ఈనెలాఖరులో ప్రారంభం



పార్కు ప్రధాన ద్వారం

మధురవాడ, జనవరి 13 : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని స్వతంత్రనగర్ కాలనీలో సుమారు రూ. 4 కోట్ల జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన పార్కును ఈనెలలో ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్కును నిర్మించారు. 90 శాతం పనులు పూర్తయినప్పటికీ విద్యుత్ లైట్లు, పబ్లిక్ అడ్రస్ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులను కూడా త్వరలో పూర్తి చేసి ఎన్నికల కోడ్ వచ్చేలోగా దీన్ని ప్రారంభించాలని అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పార్కులో ఇప్పటికే ఓపెన్ ఎయిర్ థియేటర్, గ్యాలరీ, రెండువైపులా మహిళలకు, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్లు, విశ్రాంతి తీసుకోడానికి పగోడాలు నిర్మించారు. ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్‌లు కూడా ఉన్నాయి. అలాగే వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేశారు. ఎటుచూసినా పచ్చని పూల మొక్కలు, చెట్లు కనువిందు చేస్తున్నాయి. పిల్లలు ఆడుకోడానికి రెండుచోట్ల పలు క్రీడా వస్తువులు, బెంచీలు ఏర్పాటు చేశారు. అలాగే పార్కుకు వచ్చేవారు వ్యాయామం చేయడానికి వీలుగా ఓపెన్ జిమ్ ఉంది. ఈ పార్కు ప్రారంభమైతే మధురవాడకు నూతన శోభ చేకూరుతుంది. పార్కును త్వరగా ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



దాకమర్రిలో వివిధ వేషధారణలో విద్యార్థులు

భీమునిపట్నం (రూరల్), జనవరి 13 : మండలంలోని దాకమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు పలు వేషధారణలతో ఆకట్టుకున్నారు. బాలికలు చీరకట్టుతో అలరించారు. భోగి మంట వేసి గ్రామస్తులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు సన్యాసినాయుడు భోగి,సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

వైసీపీ జిల్లా కార్యాలయంలో...

ఎండాడ : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడలో ఉన్న వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు పేడాడ రమణి కుమారీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలు, రంగు రంగుల ముగ్గులు, గంగిరెద్దుల విన్యాసాలు, ప్రత్యేక వంటకాలు, రైతులు వినియోగించే ఎద్దుల బండ్లు, గాలి పటాలతో కార్యాలయం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ రెహ్మాన్, చొక్కాకుల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : కొత్త వెంకోజీపాలెంలో వీఎంఆర్‌డీఏ మాజీ చైర్మన్ అక్కరమాని విజయనిర్మల కార్యాలయం వద్ద సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు వెయ్యి మందికి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. అలాగే కోడి పందాలు, రంగవల్లులు,భోగి మంటలు వంటి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో అక్కరమాని వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో సుదర్శన హవనం

సింహాచలం, జనవరి 13 : అప్పన్న కొండ దిగువ పూదోటలోని వేంకటేశ్వర స్వామి సన్నిధిలో శనివారం సంప్రదాయబద్ధంగా సుదర్శన హవనం నిర్వహించారు. ప్రతి నెల వేంకటేశ్వరుని ఆవిర్భావ నక్షత్రం శ్రవణం రోజున సుదర్శన హవనాన్ని నిర్వహిస్తారు. ఈమేరకు ప్రభాతారాధనలు తరువాత సుదర్శన పెరుమాళ్ మూర్తిని ప్రత్యేక వేదికపై ఉంచి మండపారాధన, బింబారాధన, కలశారాధన చేశారు. అలాగే స్వామివారికి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేసి సుదర్శన మూల మంత్రంతో హవనాన్ని జరిపారు.

సాగర తీరంలో యువత సందడి



నృత్యం చేస్తున్న యువతీ యువకులు

రామ్‌నగర్, జనవరి 13 : సాగర తీరంలో అదిరిపోయే స్టెప్‌లతో యువత సందడి చేసింది. వచ్చే నెల 10న అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ప్రముఖ సినీ గాయకుడు కార్తీక్ మ్యూజిక్ ఫెస్ట్ జరగనుంది. ప్రమోషన్‌లో భాగంగా శనివారం సాగర తీరంలో ఫోర్టు గ్రూప్ ఈవెంట్ ఆధ్వర్యంలో ఫ్లాస్ మాబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యువత కార్తీక్ పాడిన పలు సినీ గీతాలకు డ్యాన్సులు చేశారు.

ప్రమాదకరంగా కల్వర్టు



రక్షణ గోడ లేని కల్వర్టు

పద్మనాభం (రూరల్), జనవరి 13 : పద్మనాభం-శొంఠ్యాం ప్రధాన రహదారిలో మద్ది జంక్షన్ సమీపంలో ఉన్న పల్లె గెడ్డ కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంలో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కల్వర్టు నిర్మించి చాలా ఏళ్లు కావడంతో అప్పట్లో నిర్మించిన రక్షణ గోడలు శిథిలమయ్యాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళ ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి రక్షణ గోడల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అవసరం లేకపోయినా చెట్ల తొలగింపు

వెంకోజీపాలెం, జనవరి 13 : జీవీఎంసీ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెం ప్రాంతంలో ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్నాయన్న నెపంతో జీవీఎంసీ అధికారులు చెట్లను తొలగించారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో ఉన్న చెట్లు వల్ల ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగడం లేదు. కానీ అధికారులు అభివృద్ధి పేరిట, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్న సాకుతో వాటిని తొలగించారు. దీంతో ఈ ప్రాంతమంతా మోడివానిగా మారిపోయింది. వేసవిలో నీడనిచ్చే చెట్లను అధికారులు తొలగించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తీర ప్రాంతాలపై ఆర్టీసీ శీతకన్ను

సాగర్‌నగర్, జనవరి 13 : తీర ప్రాంత గ్రామాలైన సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాలపై ఆర్టీసీ శీతకన్ను ప్రదర్శిస్తోంది. ఆయా ప్రాంతాలకు తగినన్ని బస్సు సర్వీసులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 20 ఏళ్ల క్రితం ఈ ప్రాంతానికి సింహాచలం, మద్దిలపాలెం, వాల్తేరు డిపోల నుంచి బస్సు సర్వీసులు నడిపేవారు. అప్పట్లో జన సాంద్రత తక్కువ అయినప్పటికీ తగిన సంఖ్యలో బస్సులు ఉండేవి. ప్రస్తుతం తీర ప్రాంతాలు శరవేగంగా విస్తరిస్తూ జనసాంద్రత పెరుగుతోంది. అందుకు అనుగుణంగా బస్సు సర్వీసులు పెంచకపోగా ఉన్నవాటిని నిలిపేస్తుండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం రెండు సర్వీసులు మాత్రమే నడుస్తున్నాయి. దీంతో సాగర్‌నగర్ నుంచి నగరంలోకి వెళ్లాలన్నా.. సాగర్‌నగర్‌కు రావాలన్నా బస్ స్టాప్‌ల వద్ద గంటలు తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

వలంటీర్లకు కానుకలు పంపిణీ

సింహాచలం, జనవరి 13 : వలంటీర్లు నిజమైన ప్రజా సేవకులు అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సింహాచలంలోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆయన 98వ వార్డు పరిధిలోని వలంటీర్లు, ఆర్పీలకు సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల విజినిగిరిపాలెంలో జరిగిన ఘటనను కూడా టీడీపీ నేతలు రాజకీయం చేయడాన్ని తప్పుపట్టారు. కొన్ని సాంకేతిక కారణాలు,, సంక్రాంతి సెలవులు రావటం వల్ల బీఆర్‌టీఎస్ కారిడార్ నిర్వాసితులకు టీడీఆర్‌లు అందజేయడం ఆలస్యమైందని, సెలవులు ముగిసిన వెంటనే పంపిణీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొలుసు ఈశ్వరరావు, కర్రి అప్పలస్వామి, ఎర్ర వరంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మలా సీసీ కెమెరాలు

వెంకోజీపాలెం, జనవరి 13 : జీవీఎంసీ 15, 16 వార్డుల పరిధిలోని పాత వెంకోజీపాలెం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్ని నెలలుగా పని చేయడం లేదు. ఇటీవల ఇక్కడ సైకిల్ దొంగతనం జరగడంతో సీసీ కెమెరాలను పరిశీలించగా అవి పని చేయని విషయం బయట పడింది. జంక్షన్‌లో గొడవలు, కొట్లాటలు, దొంగతనాలు జరిగి నప్పుడు పోలీసులు నిందితులను సులభంగా గుర్తించేందుకు జీవీఎంసీ లక్షలాది రూపాయలతో వీటిని ఏర్పాటు చేసింది. వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టిం చుకోకపోవడంతో అనతి కాలంలోనే మూలకు చేరాయి.

ఫుట్‌పాత్‌పై వాహనాల పార్కింగ్



ఫుట్‌పాత్‌పై నిలిపిన వాహనాలు

రామ్‌నగర్, జనవరి 13 : రామ్‌నగర్ ప్రధాన రహదారి ఫుట్‌పాత్‌పై ఇష్టానుసారం ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో ఉన్న బట్టల షాపు, ఆస్పత్రికి వస్తున్న వారు ద్విచక్ర వాహనాలను ఫుట్‌పాత్‌పై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పాదచారులకు నడిచే దారి ఉండడం లేదు. కొన్ని నెలలుగా ఈ పరిస్థితి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

మద్దిలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం, జనవరి 13 : మండలంలోని మద్ది గ్రా మంలో సంక్రాంతి సందర్భంగా శనివారం రాత్రి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ రాంబాబు ఈ పోటీలను ప్రారంభించారు. ఇందులో విశాఖ, విజయనగ రం జిల్లాలకు చెందిన 40 జట్లు పాల్గొన్నాయి. మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తారు. ధర్మశాస్త్ర సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి.

సంక్రాంతికి స్వగ్రామాలకు..

సొంతూర్లకు పయనమవుతున్న పారిశ్రామిక ప్రాంత వాసులు

గాజువాక, జనవరి 13: సంక్రాంతి పండగ నేపథ్యంలో గాజువాక పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారంత తమ సొంతూళ్లకు పయనమవుతున్నారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో వివిధ పరిశ్రమలు ఉండటంతో ఉత్తరాంధ్రకు చెందిన వారితో పాటు ఏపీ, ఇతర రాష్ట్రాలకు చెందినవారు ఇక్కడ విధులు నిర్వహిస్తూ నివాసం ఉంటున్నారు. ఇప్పుడు వారంతా పెద్ద పండగ దృష్ట్యా తమ సొంతూళ్లకు వెళ్లేందుకు సిద్ధమవ్వడంతో పాత గాజువాక బస్టాప్ ప్రయాణికులతో శనివారం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. దీంతో బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు జనంతో కిటకిటలాడాయి. కాగా గాజువా పరిసర ప్రాంత వాసులు అధిక సంఖ్యలో తమ స్వగ్రామాలకు తరలివెళ్లడంతో ఆయాచోట్ల పోలీసులు పటిష్ఠ నిఘా పెట్టారు.

శిల్పారామం చెరువులో డెబ్రిస్



డెబ్రిస్‌తో నిండిపోయిన చెరువు

మధురవాడ, జనవరి 13 : జల సంరక్షణ కోసం చెరువుల్లో పూడికలు తీయిస్తుండగా దానికి భిన్నంగా శిల్పారామం చెరువులో డెబ్రిస్ కుప్పలు కనిపిస్తున్నాయి. శిల్పారామంలో సుమారు పది ఎకరాలకు పైగా చెరువు ఉండేది. కాలక్రమంలో విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రస్తుతం ఉన్న చెరువులో చుక్క నీరులేదు. వర్షాకాలంలోనైనా అందులో నీరు చేరుతుందన్న ఆశాభావంతో ఉన్న పర్యాటకులకు ఆ ఆశ కూడా తీరడం లేదు. కొందరు భవన నిర్మాణదారులు చెరువును డెబ్రిస్‌తో నింపేస్తున్నారు. ఈ చెరువులో గతంలో బోట్ క్లబ్ ఉండేది. దాన్ని కూడా మూసేసారు. ఇప్పుడు భూగర్భ జలాలు పరిరక్షించడానికి చర్యలు చేపట్టకుండా ఉన్న చెరువు గర్భాన్ని డెబ్రిస్‌తో నింపితే ఎలా అని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డిని వివరణ కోరగా యోగశాలకు ఎదురుగా కొంతమేరకు చెరువును చదును చేయడానికి మట్టి వేయమంటే డెబ్రిస్ వేసారని, దాన్ని తొలగిస్తామని చెప్పారు.

యువత దళారులను నమ్మొద్దు : మేయర్

వెంకోజీపాలెం, జనవరి 13 : జీవీఎంసీలోని ప్రజారోగ్య విభాగంలో శానిటరీ సూపర్‌వైజర్ల ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్టు కొంతమంది దళారులు నిరుద్యోగుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని,వాటిని ఎవరూ నమ్మరాదని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కోరారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజారోగ్య విభాగంలో ఎటువంటి పోస్టులు భర్తీ చేయడం లేదని చెప్పారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ఉద్యోగాల కోసం ఎటువంటి డబ్బులు చెల్లించరాదని తెలిపారు. ఈ విషయాన్ని యువత గమనించాలని కోరారు.

వైభవంగా ధారోత్సవాలు



అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

సింహాచలం, జనవరి 13 : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ధారోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం ప్రభాత ఆరాధనల తరువాత సువర్ణ తాయారు, గోదాదేవి, చతుర్భుజి తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి మంగళవాయిద్యాల నడుమ బేడామండప ప్రదక్షిణ జరిపి ఉత్తరరాజగోపురం నుంచి బయటకు వచ్చి మాడవీధుల్లో తిరువీధి జరిపారు. అనంతరం ఈశాన్య దిక్కులోని గంగధారకు తీసుకువెళ్లి ప్రత్యేక వేదికపై అమ్మవార్లను అధిష్ఠింపజేసి ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సారధ్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు.అనంతరం విశేష అలంకరణలు చేసి అమ్మవార్ల సన్నిధానంలో అధ్యాపకులు తిరుప్పావై సేవకాలం చేశారు.

సాగర్‌నగర్‌లో రూ. 3 కోట్లతో ఈట్ స్ట్రీట్



ఈట్ స్ట్రీట్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

సాగర్‌నగర్, జనవరి 13 : విశాఖ టూరిజం హబ్‌గా మారుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన సాగర్‌నగర్ బీచ్ రోడ్డును ఆనుకుని రూ. 3 కోట్లతో చేపట్టనున్న ఈట్ స్ట్రీట్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు పలుచోట్ల పార్కుల అభివృద్ధి, నగర సుందరీకరణ పనుల్లో భాగంగా జంక్షన్‌ల వద్ద పలు కళాకృతులను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే మంగమారిపేట బీచ్ రోడ్డు నుంచి భీమిలి వరకు రూ. 6 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల యువజన రీజనల్ కోఆర్డినేటర్ ముత్తంశెట్టి నందీష్, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు భీమిలి విద్యార్థి



భీమునిపట్నం, జనవరి 13 : ఝార్ఖండ్ రాష్ట్రంలో ఈనెల 17 నుంచి 21 వరకు జరిగే 67వ జాతీయ స్కూల్ గేమ్స్ అండర్ -14 బాలురు ఫుట్‌బాల్ పోటీలకు భీమిలికి చెందిన కోలా భాగ్యేష్ ఎంపికయ్యారు. మధురవాడలోని మిథిలాపురి కాలనీ వినిసిపాల్ ఎస్ఎఫ్ఎస్‌లో భాగ్యేష్ 7వ తరగతి చదువుతున్నాడు. భీమిలిలోని పాతబస్టాండ్ సమీపంలో నివశిస్తున్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ అక్కరమాని చినబాబు, స్కూల్ గేమ్స్ అసోసియేషన్ సెక్రటరీ నాగేశ్వరరావు, కోచ్ రాజేంద్ర, తదితరులు అభినందించారు.

'టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు'



గణబాబునగర్‌లో కరపత్రాలు పంచుతున్న నాయకులు

ఎంవీపీ కాలనీ, జనవరి 13 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలిపిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ 11వ వార్డు ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు అన్నారు.వార్డు పరిధిలోని గణబాబునగర్‌లో టీడీపీ నాయకులు శనివారం భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, నాయకులు ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, గోవింద్, బ్రహ్మం, నాగరాజు, ఫణింద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరుని సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు



ఆండాళ్ అమ్మవారిగా అలంకరణ

సింహాచలం, జనవరి 13 : వరాహ లక్ష్మీనృసింహస్వామి కొండదిగువ పూదోటలోని పద్మావతి, అలిమేల్ మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. ఉత్సవంలో భాగంగా శనివారం ఉత్సవమూర్తి అమ్మవారిని పలు ఆభరణాలతో ఆండాళ్ అమ్మవారిగా అలంకరించిన తీరు ఆకట్టుకుంది. సుప్రభాతాది ప్రభాతారాధనల తరువాత షోడశోపచారాలు సమర్పించి అష్టోత్తర శతనామావళితో పూజలు చేసి, తిరుప్పావై పాశురాన్ని విన్నపం చేసి తీర్థ ప్రసాదం వినియోగించారు. కాగా ఆదివారం గోదా రంగనాథుల కల్యా ణంతో ధనుర్మాసోత్సవాలు పూర్తి కానున్నాయి.

వెంకోజీపాలెం : ఎంఎంటీసీ త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి మహిళలు పూజలు నిర్వహించారు. గొబ్బెమ్మల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ గోదాదేవిని భక్తితో కొలిచారు. తొలుత గోదాదేవి అమ్మవారికి అర్చకుడు వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న స్వామిని తులసి మాలలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి సావిత్రి, కోశాధికారి కె. సుబ్బారాయుడు, మేనేజర్ బి. సన్యాసిరావు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం



బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

ఎంవీపీ కాలనీ, జనవరి 13 : తూర్పు నియోజకవర్గం పరిధిలోని 12 వార్డులో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.